ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 29 జూలై 2024

రెవెన్యూ వ్యవస్థను వైసీపీ భ్రష్టు పట్టించింది



● ఫైళ్ల దహనం వెనుక ఎంతటివారున్నా అరెస్టు చేయాలి

● మాజీ ఎంపీ చింతా మోహన్

మదనపల్లె టౌన్, జూలై 28: రాష్ట్రంలో ఐదేళ్ల పాటు పాలన సాగించిన వైసీపీ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించిందని తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ ధ్వజమెత్తారు. ఆదివారం మదనపల్లె సబ్ కలెక్టరేట్ వద్దకు వచ్చిన చింతామోహన్ అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలను దహనం చేయడం ఘోర సంఘటన అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో రన్నింగ్ ఫైళ్లు ఉంటాయని, అవన్నీ దహనం అయితే వాటిని రికవరీ చేయడానికి కాస్త సమయం పడుతుందన్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పుడు 200 ఏళ్ల క్రితమే లార్డ్ మెకాలే రెవెన్యూ చట్టాలను తీసుకొచ్చారన్నారు. గ్రామాల్లో కరణం, మునసబు, వీఆర్ఏ, వీఆర్వో స్థాయి నుంచి తహసీల్దార్‌ల వరకు ఈ చట్టాలను అమలు చేశారన్నారు. ముఖ్యంగా జమాబందీ, అడంగల్, రెవెన్యూ బోర్డు వ్యవస్థలు ఉండేవని, వాటన్నింటిని సీఎంగా పనిచేసిన జగన్ నాశనం చేశారని తెలిపారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం విచారణకు హెలికాప్టర్‌లో డీజీపీ రావడం, సీఐడీ చీఫ్ ఆధ్వర్యంలో విచారణ చేయడం చూశానన్నారు. ఈ ఆరురోజుల్లో ఈ కేసును ఛేదించడంలో పోలీసులు పురోగతి సాధిస్తున్నారని అభినందించారు. కాకుంటే విజయవాడలో పొల్యూషన్‌బోర్డులో ఫైళ్ల దహనం విషయమై ఐఏఎస్ అధికారిని వదిలివేయడం బాగాలేదన్నారు. ఈ సంఘటనపై కూడా మదనపల్లె తరహాలో చంద్రబాబు ప్రభుత్వం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర విభజనకు రెండు కుటుంబాలే కారణమని, తీరా రాష్ట్రం విడిపోయాక పదేళ్ల పాటు ఒక కుటుంబం పది వేల కోట్లు దోచుకోగా, మరో కుటుంబం కూడా ఐదేళ్లపాటు ప్రజల సొత్తు దోచుకుందన్నారు. అభివృద్ధిలో ఎక్కడో ఉండాల్సిన ఆంధ్రప్రదేశ్‌ను రెండు కుటుంబాలు భ్రష్టు పట్టించాయన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై సీఎం చంద్రబాబు కమిషన్ వేయాలని చింతా మోహన్ కోరారు.

అదును దాటుతున్నా పదునేదీ..!



● దోబూచులాడుతున్న మేఘాలు

● ముఖం చాటేస్తున్న వరుణుడు

● పదును వాన కోసం రైతన్నల ఎదురుచూపు





విత్తనం సాగు చేయడానికి దుక్కులు చేసి సిద్ధం చేసిన పొలం

లక్కిరెడ్డిపల్లె జూలై 28: మేఘాలు దోబూచులాడుతున్నాయి. రోజూ ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడటమే తప్ప పదును వాన మాత్రం కురవడం లేదు. వర్షం పడితే విత్తనం విత్తేందుకు రైతులు భూమిని సిద్ధం చేసుకుని ఉన్నారు. కానీ వరుణుడు మాత్రం వారిపై కరుణ చూపడం లేదు. భూమిని నమ్ముకుని జీవించే రైతులు సకాలంలో వర్షాలు కురవపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏటా అప్పులు చేసి విత్తనకాయలు, ఎరువులకు వేలాది రూపాయలు ఖర్చు చేసి తెచ్చి సాగు చేయడానికి సిద్ధం చేసుకుంటే తీరా వర్షాలు కురవక చివరకు అప్పుల పాలవుతున్నామని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలామంది సన్నకారు రైతులు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలు సరిపోక బ్లాక్‌లో బస్తా వేరుశనగ కాయలు రూ.3200 పెట్టి కొనుగోలు చేశారు. అయితే అన్ని కార్తెలు పోతున్నా వర్షం జాడే లేదు. ప్రతిరోజూ మేఘాలు దోబూచులాడుతున్నాయే తప్ప కిందికి చినుకు రాలడం లేదు. వర్షం కురిస్తే విత్తనం భూమిలో వేయడానికి రైతులు ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో లక్కిరెడ్డిపల్లె డివిజన్ పరిధిలోని గాలివీడు, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, వీరబల్లి మండలాల్లో సకాలంలో వర్షాలు పడితే సాధారణంగా 3519.8 హెక్టార్లలో పంటలు సాగు చేయాలి. గత 5 సంవత్సరాలుగా వర్షాలు సకాలంలో పడకపోవడంతో డివిజన్ పరిధిలో రానురాను సాగు గణనీయంగా తగ్గిపోయింది. ఇంతవరకు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో కేవలం చిరుజల్లులు పడుతున్నాయే తప్ప పదును వర్షం కురవలేదు. సాధారణంగా చిన్నపుశాలి కార్తెలో వేరుశనగపంట సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని పూర్వీకులు అంటుంటారు. వ్యవసాయ అధికారులు కూడా జూలై మొదటి వారంలో వేరుశనగ పంట సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని రైతులకు సూచిస్తున్నారు. జూలై రెండోవారమైనా వర్షం జాడే లేకపోవడంతో ఇంతవరకు పొలాల్లో విత్తనం పడలేదు. జూన్‌లో 66.5 మి.మీకుగాను కేవలం 10.2 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది. జూలైలో గాలివీడులో 38.6 మి.మీ., లక్కిరెడ్డిపల్లెలో 18.6, రామాపురంలో 19.2, వీరబల్లిలో 25.8 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది. బోర్లు, బావుల కింద మాత్రం 10 శాతం వేరుశనపంట సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు మాత్రం ప్రభుత్వం సబ్సిడీ విత్తన కాయలు 6801.3 క్వింటాళ్లు మంజూరు చేసి రైతులకు ఆర్బీకేల నుంచి పంపిణీ చేసింది. దీనికి తోడు 10 ఎకరాలు పైబడిన రైతులు బ్లాక్‌లో విత్తనకాయలు తెచ్చుకుని విత్తడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం బోర్ల కింద లక్కిరెడ్డిపల్లె మండలంలో 110 ఎకరాలు, గాలివీడులో 49.5 మాత్రమే సాగు చేశారు. రామాపురం, వీరబల్లి మండలాల్లో ఎక్కడా సాగు చేయలేదు. చినుకు పడకపోవడంతో విత్తనాలను కొంతమంది రైతులు సగం ధరకు అమ్ముకున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది డివిజన్ మొత్తం కరువే అని రైతులు అనుకుంటున్నారు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



ఈనెలాఖరు వరకు సాగు చేసుకోవచ్చు..



వర్షం కురిస్తే జూలై నెలాఖరు వరకు వేరుశనగ పంట సాగు చేసుకోవచ్చు. దిగుబడులు కూడా వస్తాయి. రైతులు కంగారు పడవద్దు. వేరుశనగతో పాటు మిగిలిన పంటలు కూడా సాగు చేసుకోవచ్చు. ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

- జయరాణి, లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ సహాయ సంచాలకులు

రూ.3200 కొనుగోలు చేశా..



ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు చాలక బస్తా 3200 రూపాయలతో కొనుగోలు చేశాను. 20 వేల రూపాయలు ఎరువులు, 20 వేలు సేద్యం మొత్తం 50 వేల రూపాయలు ఖర్చు పెట్టాం. వరుణుడు కరుణిస్తే పొలంలో విత్తనాలు సాగు చేస్తాం. గత ఏడాదిలాగా ఈ ఏడాది కూడా కరువు వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. పశువులకు మేత కూడా దక్కేలా లేదు.

- బండ్రెడ్డి శంకర్‌రెడ్డి, బి.యర్రగుడి

మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో సోదాలు

● బెంగళూరు నుంచి మదనపల్లెకు చేరుకున్న నవాజ్‌బాషా

● డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు

మదనపల్లె టౌన్, జూలై 28: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం ఘటన జరిగి వారం రోజులు కావస్తుండటంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఓవైపు ప్రధాన అనుమానితుడు రైస్‌మిల్లు మాధవరెడ్డి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు వేట సాగిస్తుండగా, మరో రెండు బృందాలు మాధవరెడ్డి సన్నిహితుల ఇళ్లలో సోదాలు చేసి, ఇద్దరు వైసీపీ ముఖ్య నాయకులను విచారించారు. ఈ క్రమంలో ఆదివారం స్థానిక సీటీఎం రోడ్డులో నివాసమున్న వైసీపీ మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంటి వద్దకు ఉదయమే పోలీసులు చేరుకున్నారు. ఆయన ఇంటిలో లేకపోవడంతో ఫోన్ చేయడంతో తాను బెంగళూరులో ఉన్నానని సాయంత్రంకల్లా మదనపల్లెకు వస్తానని నవాజ్‌బాషా చెప్పారు. ఎట్టకేలకు సాయంత్రం 5 గంటలకు నవాజ్‌బాషా మదనపల్లెకు రావడంతో పాటు తన ఇంట్లోకి పోలీసులను అనుమతించారు. డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో సీఐలు మల్లికార్జునగుప్తా, సద్గురుడు, టి.మధు, పోలీసు సిబ్బంది నవాజ్‌బాషా ఇంటిలో సోదాలు చేశారు. వీఆర్వోల సమక్షంలో ఇంట్లోని అన్ని గదులు, అల్మారాలు, బీరువాలు తనిఖీ చేశారు. ఈ సోదాల్లో నవాజ్‌బాషా ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్స్ కనపడ్డాయని సమాచారం. కాగా నవాజ్‌బాషా తరపున న్యాయవాదిని నియమించుకోగా న్యాయవాది ఎదుటే పోలీసులు సోదాలు చేశారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న రికార్డుల వివరాలన్నింటిని అక్కడే నమోదు చేసి, వీఆర్వోల సమక్షంలో పంచానామా చేసి నమోదు చేసిన వివరాలను పోలీసులు తీసుకెళ్లారు.



మదనపల్లెలో మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంట్లో సోదాలు నిర్వహిస్తుండగా బయట బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ఇంట్లోనూ...

తంబళ్లపల్లె జూలై 28 : మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల కాల్చివేత ఘటన నేపథ్యంలో శనివారం రాత్రి తంబళ్లపల్లెలోని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఇంట్లో మదనపల్లె పోలీసులు సోదాలు చేశారు. తంబళ్లపల్లె ఎస్ఐ శివకుమార్ స్థానిక రెవెన్యూ సిబ్బంది (వీఆర్ఏలు)తో కలిసి మదనపల్లె నుంచి వచ్చిన తనిఖీ బృందం ఎమ్మెల్యే ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అదే సమయంలో ఇంట్లో ఉన్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ తనిఖీలకు సహకరించినట్లు తెలిసింది. సుమారు అరగంట పాటు ఇంటిని మొత్తం జల్లెడ పట్టగా ఎటువంటి రికార్డులు లభించలేదని ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కేతు

● కేతు స్మృతి సంచిక ఆవిష్కరణలో మధురాంతకం నరేంద్ర

కడప (కల్చరల్), జూలై 28: సంపాదకుడిగా, కథకుడిగా, విమర్శకుడిగా, విద్యావేత్తగా కేతు విశ్వనాథరెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రసిద్ధ కథా నవలా రచయిత మధురాంతకం నరేంద్ర అన్నారు. రాయలసీమ ప్రాతినిధ్య కథకుడు కేతు విశ్వనాథరెడ్డి 85వ జయంతిని పురస్కరించుకుని కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి నిర్వహణలో ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో కేతు స్మృతి సంచిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రసిద్ధ రచయిత దాదాహయాత్ అధ్యక్షతన జరిగిన సభలో ముందుగా అరసం జాతీయ అధ్యక్షుడు పెనుకొండ లక్ష్మీనారాయణ కేతు స్మృతి సంచిక కేతు తలపులలో అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రధాన ప్రసంగాన్ని మధురాంతకం నరేంద్ర చేశారు. రాయలసీమ ప్రాతినిధ్య కథకుడిగా ఈ ప్రాంతపు ఆర్థిక, సాంఘిక, సంక్లిష్టతలను, సంక్షోభాలను, వాటి మాటున దాగిన మానవీయ కోణాలను ప్రతిభావంతంగా చిత్రీకరించిన కథకు నిలువెత్తు రూపం కేతు అన్నారు. కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ మాట్లాడుతూ కేతు రాసిన కథల్లో రాయలసీమ కరువు, స్త్రీ పక్షపాతమూ ఉంటుందని ఆయన కథలను ఉదహరించారు. అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ తాను కథలు రాసిన తొలినాళ్ళలో తన కథల్లో విధి పాత్రను తగ్గించుకోవాలని మంచి సూచన చేశారన్నారు. కథా రచయిత సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, విశ్రాంత చరిత్ర అధ్యాపకులు వై.ప్రభాకర్‌రెడ్డి, అరసం జిల్లా అధ్యక్షుడు ఎన్.ఈశ్వర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపకులు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు, సాహితీవేత్తలు సంజీవమ్మ, టక్కోలు మాచిరెడ్డి, సుంకోజి దేవేంద్ర, కేతు విశ్వనాథరెడ్డి కుమార్తె శిరీష, సీనియర్ పాత్రికేయుడు రమణయ్య, సీపీఐ రాష్ట్ర నాయకులు జి.ఓబులేసు, నాయకులు సుబ్రమణ్యం, ఆర్‌సీపీ నాయకులు ఎన్.రవిశంకర్‌రెడ్డి, రచయితలు, పాల్గొన్నారు.



కేతు స్మృతి సంచికను ఆవిష్కరిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, మధురాంతకం నరేంద్ర, దాదాహయాత్, తదితరులు

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

లక్కిరెడ్డిపల్లె, జూలై 28: మండలంలోని చౌటపల్లె పంచాయతీలోని రవీంద్ర నగర్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు అనే ఉపాధ్యాయుడిని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి సస్పెండ్ చేసినట్లు ఎంఈవో చక్రేనాయక్ తెలిపారు. పాఠశాలలో బాలికల పట్ల అసభ్యపరంగా ప్రవర్తించిన అతడిని సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆ ఉపాధ్యాయుడిపై పోలీసులు కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు.

యల్లమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

● కన్నుల పండువగా రథోత్సవం



ప్రత్యేక అలంకారంలో యల్లమ్మ

కలికిరి, జూలై 28: స్థానిక గ్రామ దేవత యల్లమ్మ తల్లి జాతరలో భాగంగా రెండోరోజు ఆదివారం అమ్మవారి కటాక్షం కోసం భక్తులు పోటెత్తారు. ఉదయం పట్టణంలోని పురవీధుల్లో ఊరేగిన అమ్మవారు భక్తుల ఇళ్ల ముంగిట నీరాజనాలు అందుకున్నారు. రథం లాగడానికి భక్తులు పోటీ పడ్డారు. తోబుట్టువుల మధ్య సర్వాలంకృతురాలైన అమ్మవారు దేదీప్యమానంగా భక్తులకు కనువిందు చేశారు. మధ్యాహ్నం సంప్రదాయానుసారం నాయునివారి తొలి బోనం అమ్మవారికి సమర్పించడంతో ఇతర వేలాది భక్తులు బోనాలతో మొక్కులు చెల్లించడానికి ఆలయం ముందు బారులు తీరారు. రద్దీ దృష్ట్యా పోలీసులు పలు జాగ్రత్తలు తీసుకున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం వాహనాలను దారి మళ్లించారు. ముగ్గురు సీఐలు, నలుగురు ఎస్ఐలు, 200 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు కలికిరి సీఐ మోహన్ తెలిపారు. పీలేరు, మదనపల్లె డిపోల నుంచి 30 బస్సులను ప్రత్యేకంగా నడిపారు. నిర్వాహకులు అశోక్‌కుమార్ రెడ్డి, యోగేష్ రెడ్డి, మధుసూదన రెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.



అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

అనుమతులపై చిగురిస్తున్న ఆశలు



80 శాతం సిద్ధమైన లెక్చరర్ హాళ్లు

● ఎన్ఎంసీకి ఐదు మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్ల లేఖలు

● ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్ తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు

● మదనపల్లె మెడికల్ కాలేజీ ఈ ఏడాది ప్రారంభమయ్యేనా..?

మదనపల్లె టౌన్, జూలై 28: మదనపల్లె మెడికల్ కాలేజీ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉండటంతో ఈ ఏడాది ప్రారంభమవుతుందన్న ఆశలు చిగురిస్తున్నాయి. మదనపల్లె మండలం ఆరోగ్యవరం వద్ద నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ భవనాలు అసంపూర్తిగా ఉండటం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఐదు మెడికల్ కాలేజీలను, అనుబంధంగా ఉండే ప్రభుత్వాస్పత్రులను జూన్ 24వ తేదీ నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) బృందాలు ఒకేసారి తనిఖీ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో ఎన్ఎంసీ ప్రమాణాలకు దీటుగా ఇక్కడ భవనాలు, సౌకర్యాలు లేవని ఈ ఏడాది తరగతుల నిర్వహణకు ఎన్ఎంసీ మదనపల్లె, మార్కాపురం, పాడేరు, ఆదోని, పులివెందుల ఐదు కాలేజీలకు అనుమతిని తిరస్కరించారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న ఐదు మెడికల్ కాలేజీలపై దృష్టి పెట్టింది. పదిరోజుల క్రితం సీఎం చంద్రబాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ ఏడాదే ఈ ఐదు మెడికల్ కాలేజీలకు అనుమతి వస్తే సుమారు 500 మంది వైద్య విద్యార్థులకు సీట్లు వస్తాయని, దీనిపై మరోసారి ఎన్ఎంసీకి అనుమతి కోసం దరఖాస్తు చేయాలని ఐదు మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. ఈ క్రమంలో ఐదు మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు లేఖలు రాశారు.

'ప్రథమ' తరగతులకు అనుమతులివ్వండి

దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలు వెలువడటం, ఈ ఫలితాల ర్యాంకుల్లో అక్రమాలు జరిగాయని ఉత్తర భారతదేశంలో ఆందోళనలు, పార్లమెంట్‌లో చర్చలు, సుప్రీం కోర్టు ఉత్తర్వులు వెరసి ఆగస్టులో ప్రారంభం కావాల్సిన ఎంబీబీఎస్ అకడమిక్ విద్యా సంవత్సరం ఆలస్యమవుతూ వస్తోంది. ఈ క్రమంలో మరో 30 నుంచి 50 రోజుల పాటు 2024-25 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు జరిగే అవకాశం కోసం విద్యార్థులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. అంటే మదనపల్లెతో పాటు మిగిలిన నాలుగు మెడికల్ కాలేజీలలో మొదటి దశ నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు ప్రయత్నిస్తుండగా, కాలేజీ నిర్వహణకు సరిపడా ఫ్యాకల్టీలను ఏర్పాటు చేసేందుకు డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) చర్యలు తీసుకుంటోంది. దీనిపై మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జమున ఇప్పటికే మెడికల్ కాలేజీకి అనుమతివ్వాలని ఎన్ఎంసీకి లేఖ రాశారు. ఎన్ఎంసీ సంతృప్తి చెందితే ఈ సంవత్సరమే మెడికల్ కాలేజీ నిర్వహణకు అనుమతి రావచ్చని ఆశలు రేకెత్తిస్తున్నాయి.



మదనపల్లె మెడికల్ కాలేజీ వద్ద నిర్మిస్తున్న విద్యార్థుల హాస్టల్ భవనాలు

మొదటి ఎల్‌వోపీ పూర్తయితే..

మదనపల్లె మెడికల్ కాలేజీలో ప్రథమ సంవత్సరం తరగతుల నిర్వహణకు మొదటి ఎల్‌వోపీ (లెవల్ ఆఫ్ పర్మిషన్) పూర్తయిన వెంటనే వర్చువల్ మీటింగ్‌కు సిద్ధం కావాలని ఎన్ఎంసీ అధికారులు ప్రిన్సిపాల్‌కు మెయిల్ పంపారు. ఈ క్రమంలో ఇప్పటికే మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిలో గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్థులో 400 పడకల గదులు సిద్ధం చేశారు. 400 మంది ఇన్‌పేషెంట్లు ఉండేందుకు అంతా సిద్ధం చేశారు. కాకుంటే ఎంఆర్ఐ స్కానింగ్, ల్యాబ్, తదితరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఇదిలా ఉండగా ఆరోగ్యవరం వద్ద నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ భవనాల్లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం నిర్వహణకు తరగతి గదులు, లెక్చరర్ హా ల్లు, ల్యాబులు, బాయ్స్, గర్ల్స్ హాస్టళ్ల నిర్మాణాలు 70 శా తం పూర్తయ్యాయి. కేవలం తలుపులు, కిటికీలు బిగించడం, ప్లాస్టరింగ్, పెయింటింగ్, విద్యుత్ వైరింగ్, ప్లంబ ర్ వర్కులు జరగాల్సి ఉంది. దీంతో పాటు మెడికల్ కాలేజీ ప్రధాన ద్వారం వద్ద కూడా పనుల వేగం పెంచారు.

మొదటి ఎల్‌వోపీకి ఏమేమి ఉండాలంటే..

మొదటి లెవల్ ఆఫ్ పర్మిషన్‌కు సంబంధించి మెడికల్ కాలేజీలో లెక్చరర్ హాల్స్ 2, ప్రాక్టికల్ ల్యాబొరేటరీలు 3, టీచింగ్ రూమ్‌లు 3, సెంట్రల్ లైబరీ ఒకటి ఉండాలి. హాస్టల్‌లో 110 మంది విద్యార్థులు ఉండేలా వసతులు ఉండాలి. ఆస్పత్రిలో 330 బెడ్లు ఉండాలి. నాలుగు మేజర్ ఆపరేషన్ థియేటర్లు, ఒక మైనర్ ఆపరేషన్ థియేటర్ ఉండాలి. ఐసీయూ బెడ్లు 60 ఉండాలి. ఇవి ఉంటే మొదటి సంవత్సరం విద్యార్థులకు అవసరమైన బోధనలకు సరిపోతాయి.



సగం వరకు పెయింటింగ్ పూర్తయిన అనాటమీ ల్యాబ్

మూడు సబ్జెకుల బోధనలకు సిద్ధం

ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరంలో ముఖ్యమైన అనాటమి, ఫిజియాలజి, బయోకెమిస్ట్రీ సబ్జెక్టుల బోధనలు, వాటికి అవసరమైన ల్యాబ్‌లు, ప్రాక్టికల్స్ చేసేందుకు కావాల్సిన సదుపాయాలను మొదటి ఎల్‌వోపీలో సిద్ధం చేసేందుకు అటు డీఎంఈ తరపున ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, ఇటు ఏపీఎంఎస్ఐడీసీ తరపున ఎస్ఈ ఆనందరెడ్డి కృషి చేస్తున్నారు. దీంతో పాటు కాలేజీలో బోధనలు చేసేందుకు, ఆస్పత్రిలో వైద్యం అందించేందుకు 222 మంది సిబ్బంది (ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, వైద్య సిబ్బంది) అవసరం ఉంది. ఇందులో 70 శాతం సిబ్బంది నియామకం జరిగినా కొంతమంది ఇక్కడ జాయిన్ కావడం లేదు. డీఎంఈ నిర్వహించే కౌన్సిలింగ్‌లో ఉత్తరాంధ్ర నుంచి ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు నియామకాలు ఇచ్చినా అక్కడి నుంచి మదనపల్లె దూరం కావడంతో చాలా మంది ఇక్కడ చేరేందుకు ముందుకు రావడం లేదు. దీంతో డీఎంఈ ప్రతి 15 రోజులకు ఒకసారి కౌన్సిలింగ్ ప్రక్రియ చేపట్టాల్సి వస్తోంది.

నెలన్నర సమయంలో పూర్తయితేనే అనుమతి

మదనపల్లె మెడికల్ కాలేజీకి మొదటి ఎల్‌వోపీకి అవసరమైన అన్ని వసతులు నెలన్నర రోజుల్లో పూర్తయితే ఎన్ఎంసీ అనుమతులు వచ్చే అవకాశం ఉంది. నీట్ ఫలితాలు వచ్చాక విద్యార్థులకు మొదటి కౌన్సిలింగ్, రెండు, మూడు కౌన్సిలింగ్‌లు నిర్వహించడానికి ఎంత లేదన్నా నెలన్నర రోజులు పట్టే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఈ గడువులోగా మొదటి ఎల్‌వోపీ పనులు పూర్తి చేస్తే మదనపల్లె మెడికల్ కాలేజీలో 100 మంది విద్యార్థులు ఈ ఏడాది నుంచే చదువుకునే అవకాశం ఉంది.

మొబైల్ షాపులో చోరీ...

బద్వేలు టౌన్, జూలై 28: స్థానిక మైదుకూరు రోడ్డులోని మొబైల్ మార్ట్‌లో ఆదివారం 3 మొబైల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. దుకాణంలోకి కస్టమర్లుగా వచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు తమ వద్ద ఉన్న మొబైల్‌ను షాపు యజమానికి చూపించి మాటల్లో పెట్టగా, మరో వ్యక్తి మూడు సెల్‌ఫోన్లను చోరీ చేశాడు. వారు వెళ్లిన అనంతరం మూడు మొబైల్స్ కన్పించకపోవడంతో సీసీ ఫుటేజీని పరిశీలించగా, చోరీ జరిగినట్లు తేలిందది. దీంతో బాధితుడు బద్వేలు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వీరపునాయునిపల్లె, జూలై 28: మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమదంలో ఇరువురికి గాయాలయ్యాయి. ఉమ్మారెడ్డిపల్లెకు చెందిన లలిత, మహేశ్వర్‌రెడ్డి ద్విచక్రవాహనంలో నందిమండలం సమీపంలోని కొండగంగమ్మ వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా వీరపునాయునిపల్లె వద్ద వెనుకనుచి కారు ఢీకొంది. దీంతో బైకు వెనుక కూర్చున లలిత ఎగిరిపడడంతో తలకు గాయాలయ్యాయి. మహేశ్వర్‌రెడ్డి కూడా గాయాలపాలవడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో పక్కనే ఉన్న బంకు దెబ్బతినింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

● బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు,వెండి వస్తువులను చూపుతున్న డీఎస్పీ వినోద్‌కుమార్

వేంపల్లె, జూలై 28: స్థానిక బండల ఉత్తన్న వీధిలోని ఓ ఇంట్లో బంగారు, వెండి నగలు చోరీ చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారంపులివెందుల డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐ చాంద్‌బాషా విలేకరులకు వివరాలను వెల్లడించారు. బండల ఉత్తన్న వీధికి చెందిన సయ్యద్ నూర్జహాన్ తన కొడుకు, కోడలుకు చెందిన బంగారు, వెండి వస్తువులు బీరువాలో దాచిఉంచింది. గత నెల 19న కడపకు వెళ్లి జూన్ 26న ఇంటికి తిరిగివచ్చిన ఆమె బంగారు నగదు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించింది. ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ చాంద్‌బాషా, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ వర్మ, కానిస్టేబుళ్లు కిరణ్, మహేష్ నిందితులను గాలించి ఆదివారం అరెస్టు చేశారు. సుమారు రూ.5లక్షల విలువైన బంగారు, వెండి నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఎర్రచందనం అక్రమరవాణా కేసులో ఒకరి అరెస్టు



నిందితుడితోపాటు కారును చూపుతున్న పోలీసులు

గోపవరం, జూలై 28 : ఈ నెల 23న పీపీకుంట సమీపంలో రేగిమానుకుంట వద్ద 59 ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్న కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు పిల్లిబోయిన వెంకటరమణను శని వారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ విక్రమసింహ, బద్వే లు రూరల్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఈ సంద ర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 27 రాత్రి 8 గంటల సమయంలో నిందితుడు కారులో నెల్లూ రు వైపు పారిపోతుండగా అరెస్టు చేసి, అతడు నేరంలో ఉపయోగించిన కారును, ఒక మొబైల్‌ను అతడి నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న ఇంకా కొంత మంది నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

ఓబులవారిపల్లె, జూలై 28: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య జ్యోతి కథనం మేరకు మంగంపేట కాపుపల్లె ఎస్టీ కాలనీకి చెందిన వెలుగు రాజా అలియాస్ రాజేంద్ర ఆదివారం తెల్లవారుజామున వేటకు వెళుతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంట్లోంచి బయలుదేరాడు. అయితే, అతను ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో గాలించగా కొర్లకుంట గ్రామం చలంపాలేనికి వెళ్లేదారిలో ఏపీఎండీసీ డంప్ కింద అతని మృతదేహం లభించింది. కాగా, వేటకు వెళ్లిన సమయంలో ఎక్కడైనా పొలాలకు వేసిన విద్యుత్ కంచె తగిలి మృతి చెందడంతో మృతదేహాన్ని అక్కడికి తెచ్చి పడేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి రావలసి ఉంది

ప్రభుత్వం మారినా తీరు మారని రిమ్స్ అధికారులు



ప్రభుత్వం మారినా పాత ప్రభుత్వం నాటి చిత్రాలతోనే ఉన్న ఆరోగ్యశ్రీ కేబిన్

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 28 : ప్రభుత్వం మారి రెండు నెలలు గడుస్తున్నా కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇంకా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని మర్చిపోలేకపోతున్నారు. నిత్యం వేలాది మంది ప్రజలు వచ్చే ఓపీ విభాగంలో ఆరోగ్యశ్రీ కేబిన్‌పై జగన్ ఫొటో ఇప్పటికీ బాహటంగా ప్రదర్శించారు. ఆసుపత్రికి సంబంధించిన ప్రతి అధికారి, ఉద్యోగి, సిబ్బంది, సెక్యూరిటీ, శానిటేషన్, నర్సు లు, వైద్యులు, వైద్యేతర సిబ్బంది ఉన్నతాధికారులు తిరిగే ప్రదేశం అయినప్పటికీ ఇది మా బాధ్యత కాదు అనుకున్నారో ఏమో. ఎవరికీ పట్టనట్లు వ్యవహరించారో తెలియడంలేదు మరి. ఏదిఏమైనా ఆసుపత్రి సిబ్బంది ఏ మాత్రం బాధ్యత లేకుండా వ్యవహరించడంపై రోగులు చర్చించుకుంటున్నారు.

ఆగిన 'మీ సేవ'

● సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, రైతుల ఇక్కట్లు
● ఎన్‌ఓసీలపై జాప్యం చేస్తున్న కంపెనీ నిర్వాహకులు



మీసేవ కేంద్రం

పులివెందుల టౌన్, జూలై 28: మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు 20 రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆశించిన మేరకు సేవలు అందకపోతుండడంతో వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, రైతులు ఇక్కట్లకు గురవుతున్నారు. రైతులు బ్యాంకు రుణాల రెన్యువల్‌కు అవసరమైన 1బి, అడంగల్ పత్రాలకోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటర్, ఇంజనీరింగ్ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లలో వివిధ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అక్కడి నుంచి వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్, ఆర్డీఓ లాగిన్ వరకు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో ఉన్న గడువు కాస్త పూర్తవుతుందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ బిల్లులు, ఇంటి పన్ను, నీటిపన్ను, చెల్లించలేని పరిస్థితి ఉండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏపీఆన్‌లైన్ సెంటర్లు 238, అర్బన్ ఫ్రాంచైజీలు 50 ఉన్నాయి. వీటికి ఏపీ ఆన్‌లైన్, రామ్‌ఇన్ఫో సర్వీసులు అందిస్తున్నాయి. ఈ రెండు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి బకాయిలు పడినట్లు తెలిసింది. దీంతో మూడు వారాల కిందట ప్రభుత్వ మీసేవ కేంద్రాలకు, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలకు సర్వీసులను నిలిపివేసింది. ఆయా సంస్థలు బకాయిలు ఏమీలేనట్లు ఎన్‌ఓసీలు తెచ్చుకుంటేనే సర్వీసులు పునరుద్ధరిస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే ఆయా సంస్థలు ఎన్‌ఓసీ తెచ్చుకోవడంలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో, మీసేవ కేంద్రాలో సేవలు నిలిచాయి. ఒక్కో కేంద్రంలో సగటున 350 సర్వీసులను ప్రజలు వినియోగించుకుంటారు. 1బి, అడంగల్, మ్యుటేషన్, అడంగల్ కరెక్షన్, నీటిపన్ను, విద్యుత్, ఆస్తి పన్ను, ఆర్డీఏ, రిజిస్ట్రేషన్, కుల, ఆదాయ, బర్త్, డెత్ తదితర సేవల కోసం వీటికే ఎక్కువ వెళ్తుంటారు. అక్కడ సర్వీస్ చార్జీలు చెల్లించుకుని నిర్ణీత తేదీన సర్టిఫికెట్లను కేంద్రాల నిర్వాహకులు అందిస్తుంటారు. కుల ధ్రువీకరణ, ఆదాయం వంటి సర్టిఫికెట్లను విద్యార్థులకు అడ్మిషన్ల సమయంలో విద్యాసంస్థలు కోరుతుంటాయి. దీంతో అంతా మీ సేవ కేంద్రాల వైపు చూస్తుంటారు. ఒక్కసారి కులధ్రువీకరణ పత్రం ఇచ్చిన తర్వాత మళ్లీ తాజాగా తీసుకు రావాలని కోరవద్దని ప్రభుత్వం ఆదేశించినా, వివిధ శాఖలు వాటిని బేఖాతర్ చేస్తున్నాయి.

అయితే విద్యార్థులు అవసరాలను సొమ్ము చేసుకునేందుకు కొందరు రెవెన్యూ అధికారులు మైగ్రేషన్ సర్టిఫికెట్ తీసు కురావాలని చెబుతున్నారు. ఆ సర్టిఫికెట్ తెచ్చుకోలేనివారు, దళారులకు డబ్బు సమర్పించుకుంటేనే కులధ్రువీకరణ పత్రం అందుతుంది. రోజూ మీసేవ ద్వారా లక్షల రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరు తుంది. 20 రోజులుగా సర్వీసులు నిలిచిపోవడంతో ఆ మేరకు ప్రభుత్వా నికి నష్టం జరిగింది. తక్షణం సర్వీసులను పునరుద్ధరించాలని మీసేవ నిర్వాహకులు, ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం: కలెక్టర్

● ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి


జమ్మలమడుగు, జూలై 28: ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదని కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాల ఆవరణంలో దేవగుడి శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం పేదలకోసం ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టిందన్నారు. పెన్నానదిలో ఇసుకను వెలికితీసే ఖర్చులు మాత్రమే చెల్లించాలన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ ఆరోగ్యం చాలా ప్రధానమైందన్నారు. కడపజిల్లాలో పోలీసుల పనితీరు విమర్శలు రాకూడదన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ చక్కటి పథకమన్నారు. ప్రతినెల రెండవ శనివారం ఇదే ప్రాంగణంలో మెడికల్ క్యాంపు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, కమిషనర్ ప్రమోద్‌కుమార్, కూటమి నాయకులు దేవగుడి యూత్ నాగేశ్వరరెడ్డి, డాక్టర్ రాజేష్‌రెడ్డి, గోనా పురుషోత్తంరెడ్డి, నాగేంద్రయాదవ్, బీర్రు సంతోష్, నవనీశ్వరరెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ సూచించారు. ఆదివారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ తదితర శాఖలకు సంబందించిన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, పంచాయతీరాజ్ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు వారి వారి శాఖలకు సంబంధించిన సమస్యలను వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, ఆస్పత్రుల్లో నీరు, విద్యుత్ తదితర సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. కాగా, తనకు పెన్షన్ ఇప్పించాలని కలెక్టరుకు వినతిపత్రం ఇచ్చేందుకు సమావేశ మందిరం వద్ద మూడు గంటలపాటు ఎదురు చూసినా పట్టించుకోకుండా వెళ్లిపోయారని పట్టణంలోని మార్వాడీ వీధికి చెందిన తిప్పమ్మబాయి (70) అనే వృద్ధురాలు విలేకరుల ఎదుట వాపోయింది.

ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీల్లో భారీ స్కోర్ దిశగా కృష్ణా జట్టు

● కడప... వెస్ట్‌గోదావరి జట్లు వెనుకంజ



క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

కడప (స్పోర్ట్స్) జులై 28: కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 ఇంటర్ డిస్ట్రిక్ట్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ఆదివారం కృష్ణా జిల్లా జట్టు 370 పరుగుల భారీ స్కోర్ సాధించగా, కడప, వెస్ట్‌గోదావరి జట్లు ఎదురీదుతున్నాయి. వివరాలిలా...

ఏసీఏ క్రికెట్ స్టేడియంలో: వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో టాస్ నెగ్గిన కృష్ణా జట్టు 90 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి ఆట ముగిసే సమయానికి 370 పరుగుల భారీ స్కోర్ సాధించింది. ఇందులో వరుణ్ సాత్విక్ 158 పరుగులు చేయగా, గీత్ 84 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

కేఎస్ఆర్ఎం మైదానంలో: కేఎస్ఆర్ఎం మైదానంలో టాస్ నెగ్గిన కడప జట్టు బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు 63.3 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో కె. థామస్‌రామ్‌కుమార్ 104 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. ఇందులో గురువిఘ్నేష్ 59 పరుగులు చేయగా రోహిత్ 39 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు.

కెఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో టాస్ నెగ్గిన విశాఖ జట్టు 53 ఓవర్లలో 171 పరుగులకే కుప్పకూలింది. తదుపరి బ్యాటింగ్‌కు ప్రారంభించిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 123 పరుగులకే చేతులెత్తేసింది. దీంతో ఇంకా 48 పరుగుల లోటుతో ఎదురీదుతొంది. ఆటకు సోమవారం రెండవరోజు.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు

కడప(కలెక్టరేట్) జులై 28: వేతన బకాయిలు చెల్లించాలని ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం నగరంలోని ఎన్జీవో హోంలె ఏపి ఎన్జీవో సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన డీఏను జూలై నెల జీతంతో కలిపి ఉద్యోగులకు చెల్లించనుండడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఉద్యోగులు పూర్తి స్థాయిలో సహకారం అందించేందుకు దోహదపడనుందన్నారు. జూలై నెల జీతం, పింఛన్లు కూడా ఆగస్టు 2వ తేదీలోగా ప్రభుత్వం చెల్లించేలా ప్రభుత్వం చర్య లు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్ జిల్లా కార్యదర్శి డి. రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు తిమ్మారెడ్డి, కోశాధికారి నిత్యపూజయ్య, తాలూకా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్తపల్లి అగ్రహారం.. దారి మరీ అధ్వానం!

● ఐదేళ్ల క్రితం పనులు మంజూరు ● ఇంకా పూర్తికాని వైనం ● వర్షం వస్తే ఇబ్బంది పడుతున్న ప్రజలు



ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న కొత్తపల్లి అగ్రహారం రోడ్డు



కల్వర్టు వద్ద అధ్వానంగా రోడ్డు

పుల్లంపేట, జూలై 28: ఊరి పేరేమో కొత్తపల్లి అగ్రహారం. ఈ ఊరికి వెళ్లేదారి మరీ అధ్వానం. సక్రమమైన రహదారి లేకపోవడంతో వర్షాకాలంలో అవస్థలు వర్ణనాతీతం. ఎట్టకేలకు ఐదేళ్ల క్రితం తారురోడ్డు మంజూరై.. పనులు ప్రారంభమయ్యాయి.. కానీ కష్టాలు రెట్టింపయ్యాయి. వివరాల్లోకెళితే....

పుల్లంపేట మండలం కొమ్మనవారిపల్లె పంచాయతీ కొత్తపల్లి అగ్రహారంలో అందరూ వ్యవసాయ కూలీలే. 400 మంది వరకు జనాభా ఉంది. పుల్లంపేట నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు బాగా దెబ్బతినింది. మరమ్మతులు చేయాలని నేతలు, అధికారులను వేడుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. వర్షం వచ్చినపుడు పుల్లంపేటలోని పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు కూడా ఇబ్బందులు పడేవారు. దీంతో వర్షం కురిసినన్ని రోజులూ విద్యార్థులు బడికి సెలవులిచ్చేసేవారు. ఆటోలు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో గ్రామంలో ఎవరికైనా జబ్బు చేస్తే ఇబ్బందులు పడేవారు. దీంతో కొన్నిసార్లు గ్రామస్థులే చందాలు వేసుకుని రోడ్డును బాగు చేయించుకున్న సందర్భాలున్నాయి. ఐదేళ్ల కిందట ఈ గ్రామానికి స్పెషల్ గ్రాంట్ కింద తారురోడ్డు మంజూరైంది. రోడ్డు మంజూరైన ఏడాదికి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. రోడ్డుకిరువైపులా మట్టిని తీసి రోడ్డుపై వేసి పనులు ప్రారంభించడంతో గ్రామస్థులకు ఇబ్బంది ఉన్నా రోడ్డు బాగవుతుందన్న సంతోషంతో నెట్టుకొచ్చారు. ఆరు నెలలు తిరకగముందే రోడ్డు పనులు నిలిచిపోయాయి. అప్పటినుంచి గ్రామస్థుల కష్టాలు మరింత అధికమయ్యాయి. దీంతో చెరువు కట్టమీదుగా ఏడు కిలోమీటర్లు చుట్టుకుని పుల్లంపేటకు చేరుకునేవారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులంతా కలిసి అప్పట్లో రాజంపేట ఆర్డీఓ పఠాన్ అహ్మద్‌కు విన్నవించుకున్నారు. వెంటనే ఆర్డీఓ స్పందించి స్వయంగా గ్రామాన్ని సందర్శించారు. రోడ్డు పరిస్థితి చూసి అక్కడికక్కడే అధికారులతో మాట్లాడారు. వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. చెప్పిన విధానంగానే పనులు ప్రారంభమయ్యాయి. ఏమైందో ఏమో రోడ్డుపై కంకర వేసినా పనులు మధ్యలోనే ఆగిపోయాయి. తారు వేస్తే ఈ రోడ్డు పూర్తవుతుంది. రోడ్డు పనులు మళ్లీ ఆగిపోవడంతో గ్రామవాసుల కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. ప్రస్తుతం కల్వర్టులు పూర్తికాక పోవడంతో వర్షం వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు ఈ రోడ్డును పూర్తి చేసి కొత్తపల్లి వాసుల కష్టాలను తీర్చాలని అధికారులు, నేతలను వేడుకుంటున్నారు.

వర్షం వస్తే తిప్పలే..

వర్షం వచ్చినప్పుడు మా బాధలు వర్ణాతీతం. రోడ్డు అంతా బురదమయమై చెప్పులు చేతుల్లో పట్టుకుని నడవాల్సిందే. లేదంటే జారిపడి కిందపడితే ఏం విరుగుతుందో చెప్పలేం. గతంలో కిందపడి ఆస్పత్రి పాలైన వాళ్లు కూడా ఉన్నారు. ఇప్పటికైనా రోడ్డును బాగుచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రమణ, కొత్తపల్లె అగ్రహారం

వైసీపీ తొత్తు ఆస్కార్‌రావు

● ఉద్యోగుల పక్షానా పోరాడుతున్న నేత సూర్యనారాయణ
● ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘ జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్



మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు ఎం.రమేష్ కుమార్

కడప(కలెక్టరేట్), జూలై 28: ఉద్యోగుల వ్యతిరేక విధానాలతోపాటు, వైసీపీకి తొత్తుగా వ్యవహరించడంతో ఆస్కార్ రావు, శ్రీకాంత్‌ను సంఘం నుంచి గతంలోనే బహిష్కరించామని ప్రభుత్వ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.రమేష్ బాబు స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని ఆ సంఘ కార్యాలయంలో రాష్ట్ర సెక్రటరీ రఘు రామనాయుడు, నగర అధ్యక్షుడు కృష్ణ ప్రసాద్‌తో కలసి ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో కానీ, ఏ జిల్లాలో కూడా అధ్యక్ష ,కార్యవర్గ సభ్యత్వం లేని ఆస్కార్ రావు, శ్రీకాంత్ రాజు విజయవాడలో ప్రెస్‌మీట్ పెట్టి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల పక్షాన పోరాడుతున్న సూర్యనారాయణపై తీవ్ర ఆరోపణలు చేయడమే కాకుండా సంఘం నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇలాంటి చవకబారు ప్రకటనలను ఖండిస్తూ కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల నుంచి తాము సూర్యనారాయణకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. 6 నెలలుగా ఆస్కార్ రావు రాష్ట్ర అధ్యక్ష పదవిపై కన్ను వేశారన్నారు. సూర్యనారాయణపై గత వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెడితే, పదవీ కాంక్షతో అవ కాశంగా మలుచు కోవాలనీ కుట్ర పన్ని విఫలమయ్యారని విమర్శించారు ఉద్యోగులు, కార్మికుల పక్షాన రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ పోరాడుతుంటే ఆస్కార్‌రావు బృందం మాత్రం వైసీపీతో అంటకాగుతూ మీటింగ్‌లో ఎవరు పాల్గొనకుండా బెదిరింపులకు దిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతినేలా ఐక్యవేదిక సమావేశాలకు హాజరు కాకుండా జగన్ ప్రభుత్వం కోసం ఆ స్కార్ రావు పడిన తాపత్రయం ఉద్యోగ,కార్మిక ,పెన్షనర్లకు తెలుసన్నారు. వారి వ్యవహార శైలిని గమనించిన రాష్ట్ర, జిల్లా కార్యవర్గాలు సంఘ కార్యకలపాలకు సంబంధం లేకుండా పూర్తిగా బహిష్కరించిన తరువాత కూడా ఇలాంటి మీడియా సమావేశాలు నిర్వహించే అర్హత లేదని హెచ్చరించారు. ఆస్కారరావును ఉద్యోగులు నమ్మరన్నారు. బహిష్కరించినప్పటికీ ప్రధాన కార్యదర్శి పదవి కోసం వెంపర్లాడుతున్న ఆ స్కార్‌రావు, శ్రీకాంత్ రాజు కుట్రలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని రమేష్ కుమార్ స్పష్టం చేశారు. ఈసమావేశంలో జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి నాగశేషులు, రాధాకృష్ణారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి

● ఆరు నెలల్లో నీటి సమస్య పరిష్కారం ● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్, జూలై 28: రాబోయే ఆరు నెలల్లో రాయచోటి నియోజకవర్గంలో నీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తాగు, సాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇందులో భాగంగా రాయచోటి నియోజకవర్గంలో రాబోయే ఆరు మాసాల్లో పూర్తిగా నీటి సమస్య పరిష్కరించేందుకు ఒక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. గతంలో నియోజకవర్గ ప్రజలు నీటి సమస్యలతో నానా ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. దీంతో రాయచోటి నియోజకవర్గంలోని సంబేపల్లె, చిన్నమండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో ప్రజలకు ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలో ఎక్కడెక్కడ నీటి సమస్య ఉందో గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం నీటి సమస్య కోసం బోర్లు వేయించడం, పైపులైన్‌ల మరమ్మతులు చేపట్టడం, నియోజకవర్గంలో ఉన్న మంచినీటి పథకాలను ఉపయోగంలోకి తీసుకురావడం వంటి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం నియోకవర్గంలోని రామాపురం మండలంలో నల్లగుట్టపల్లె హరిజనవాడలో, సంబేపల్లె మండలంలోని దుద్యాల గ్రామంలో, దిగువ మాదిగపల్లెల్లో రెండు కొత్త బోర్లను మంత్రి సోదరులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. జిల్లాలోని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఎక్కడ నీటి సమస్య ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. రాయచోటి నియోజకవర్గంలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రజలు సహకరించి రాయచోటిని నీటి సమస్య రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని మంత్రి కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి(కలెక్టరేట్), జూలై 28: ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా సమస్యల పరిస్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్‌తో పాటు, మండలాల ప్రజలు వారి సమస్యలను తెలియజేచేందుకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు రావల్సిందిగా వారు తెలియజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


వరినాట్లు నాటుతున్న రైతులు

సిద్దవటం, జూలై 28: మండలంలోని జ్యోతి రైతు సేవాకేంద్రం పరిధిలోని వెంకటాయపల్లెలో ఆదివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు నాగరాజు ప్రకృతి వ్యవసాయ రైతు, కార్యకర్త వరినారు పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వరినారు నాటేప్పుడు వాటి కొనలను తుంచి నాటడం మంచిదన్నారు. ఇలా చేయడం వల్ల కాండం తొలుచు పురుగు నివారణ జరుగుతుందని, అలాగే బీజామృతం తయారు చేసుకుని వరినారును అందులో నుంచి నాటేందుకు ఏర్పాటు చేశారు. దీనివల్ల తెగుళ్ల ఉధృతి తగ్గుతుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక నికర ఆదాయం ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యమవుతుందన్నారు. టక్కోలి, మాచుపల్లె గ్రామాల్లో 13 మంది కార్యకర్తలు పని చేస్తున్నారని, ఫోన్లద్వారా సంప్రదించినా ఈ పద్ధతులపై అవగాహన కల్పిస్తారన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాజంపేట, జూలై 28: ప్రేమ్‌చంద్ హిందీ భవన్‌లో సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక భారతీయ విద్యానికేతన్ పాఠశాలలో జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు జరిగాయి. ఈ పోటీలను సంస్థ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్రాజ్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీతత్వం ఉన్నప్పుడే భవిష్యత్‌లో ఏ రంగంలోనైనా రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులలో సృజనాత్మక శక్తి పెరుగుతుందన్నారు. ఈ పోటీలకు పలు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 31న హిందీ రచయిత ప్రేమ్‌చంద్ జయంతి రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

కలగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లు

- సంవత్సరాల తరబడి రైతుల ఎదురుచూపు
- మంజూరైనా ఇవ్వని అధికారులు
- అధికారుల చుట్టూ తిరిగినా కనికరించని వైనం


ట్రాన్స్‌ఫార్మర్లు లేక బీడు భూములుగా మారిన వ్యవసాయ బావి

గాలివీడు, జూలై 28: వైసీపీ ప్రభుత్వంలో వేధింపులకు గురి కానివారంటూ ఎవరూ ఉండరేమో. ప్రజలతో పాటు రైతులను కూడా అన్ని రకాలుగా ఇబ్బందులకు గురిచేశారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఆన్‌లైన్ డబ్బులు కట్టినా ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. అదే వైసీపీ నాయకులు, కార్యకర్తలకైతే కేవలం రెండు నెలల్లోనే ట్రాన్స్‌ఫార్మర్లను బిగించారనే ఆరోపణలున్నాయి. రైతులు వేసుకున్న బోరుబావులకు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి డబ్బులు చెల్లించి సంవత్సరాలు గడుస్తున్నా అధికారులు ఇంతవరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో నేతల సిఫార్సు ఉన్న వారికి రెండు నెలల్లోనే ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసి అమర్చేవారు. దీంతో కొందరు పొలాలు బీళ్లుగా పెట్టుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

మండలంలో 70 శాతం మంది ప్రజలు వ్యవసాయరంగం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రజలకు వచ్చే ఆదాయం అత్యధికంగా ఈ రంగం నుంచే వస్తుంది. మండలంలో ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ వరి, వేరుశనగ, రాగి, సజ్జ, జొన్న వంటి పంటలతో పాటు పొద్దుతిరుగుడు, టమోటా, బెండ, వంకాయ, అలసంద, మిరప వంటి కూరగాయల పంటలను కూడా సాగు చేస్తున్నారు. అయితే ముఖ్యంగా మండలంలో వేరుశనగ అత్యధికంగా సాగు చేయగా మిగతా పంటలు తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఇతర ఆకుకూరలు, పండ్ల తోటలు, కూరగాయల తోటలను సాగు చేయడం ఎక్కువైంది. అన్నిరకాల పంటలను సాగు చేయాలంటే నీటి లభ్యతతో పాటు విద్యుత్ సౌకర్యం కూడా అవసరం. కానీ మండలంలో నీటి వనరులు ఉన్నా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కొరత వల్ల రైతులు పంటల సాగులో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నీరు ఉండి కూడా ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టకపోవడంతో వందలాది ఎకరాల వ్యవసాయ భూములు బీడు భూములుగా మారిపోతున్నాయి. రైతులకు చేతినిండా పని ఉండాల్సిన కాలంలో ఖాళీగా ఉన్నారు. కొంతమంది రెండు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు అతీగతీ లేదు. మరికొంత మందికి ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరై ఆరు నెలలు గడుస్తున్నా ఇంతవరకు వాటిని ఇవ్వలేదని రైతులు ఆరోపిస్తున్నారు. మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్ల కోసం కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా సమాధానం చెప్పే అధికారులు లేరని రైతులు వాపోతున్నారు. మండలంలోని 17 పంచాయతీల్లో దాదాపుగా 100కు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు పెండింగ్‌లో ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం ట్రాన్స్‌కో అధికారుల అలసత్వం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులు ట్రాన్స్‌ఫార్మర్లకు అందివ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై గాలివీడు ట్రాన్స్‌కో ఏడీఈ విజయ్‌కుమార్‌ను వివరణ అడిగేందుకు ఫోనులో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు. వాట్సాప్ మెసేజ్ చేసినా స్పందన రాలేదు.

ట్రాన్స్‌ఫార్మర్ లేక సాగు చేయలేదు

- వెంకటసుబ్బయ్య, అలుగంటివారిపల్లె



నేను పొలాన్ని సాగు చేయడానికి బోరు వేసు కొన్నాను. బోరుకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం 2023లో దరఖాస్తు చేసుకున్నా. లైన్‌మెన్ వచ్చి ఎస్టిమేషన్ వేసిన ప్రకారం డబ్బులు చెల్లించాను. ఈ ఏడాది జనవరిలో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైందని ట్రాన్స్‌కో అధికారులు తెలియజేశారు. మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను నాకు ఇవ్వాలని అధికారులను పదే పదే అడిగాను. ఈరోజు రేపు అంటున్నారు. గత రెండేళ్లుగా నా భూములు బీడు భూములుగా మారి మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్లను ఇవ్వాలని కోరుతున్నాను.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం : ఐఎఫ్ఎస్

రాయచోటిటౌన్, జూలై 28: జిల్లా కేంద్రమైన రాయచోటి నియోజకవర్గంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు కండీషన్‌లో లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని, వాటిపై రవాణాశాఖ అధికారులు దాడులు చేయాలని ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సాయికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక ఐఎఫ్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణంతో పాటు నియోజకవర్గంలో ప్రైవేటు స్కూల్ బస్సులు నడుపుతున్న కొంత మంది డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. లేనిపక్షంలో ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ రాయచోటి కన్వీనర్ చెన్నూరు శివతేజ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం'

సంబేపల్లె, జూలై 28: గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలన రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేసే లక్షలాది మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీ జేఏసీ నేతలు మండిపడ్డారు. ఈ మేరకు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ దామోదర్‌రావు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.సుమన్, ప్రధాన కార్యదర్శి సురేశ్‌లకు తెలియజేసినట్లు జేఏసీ జిల్లా సభ్యులు తెలిపారు. ఆదివారం విజయవాడ లెనిన్ సెంటర్‌లో గల రెవెన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి అనుబంధంగా ఉన్న కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ, 26 జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బొప్పరాజు, పలిశెట్టి ముఖ్య అతిథులుగా హాజరై సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ సభ్యులు పద్మనాభుడు, రాంమూర్తినాయక్, చంద్రశేఖర్, నాగరాజు, కర్నూలు జిల్లా ఎలక్ట్రిషన్ నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా యల్లమ్మ జాతర

నందలూరు, జూలై 28: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ నారాయణరాజుపేట గ్రామంలో వెలసిన యల్లమ్మతల్లి జాతర మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకాలు అత్యంత సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పెద్దఎత్తున అమ్మవారికి అంబళ్లను సమర్పించారు. భక్తులు జాతరల్లో పాల్గొని తమ మొక్కులను తీర్చుకున్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం : ప్రసాద్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్‌బాబు

రాయచోటిటౌన్, జూలై 28: లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ సేవలు అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు ప్రసాద్ బాబు అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల ప్రీతం రెసిడెన్సీలో లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆఫ్ రాయచోటిటౌన్ వారు పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఎంతో మంది ఆపదలో ఉన్న వారి కోసం సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో ప్రజల కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అలాగే సేవా కార్యక్రమాలకు తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు బయారెడ్డి, సంగమ్మ, క్లబ్ వ్యవస్థాపకుడు పీఎస్ హరినాథరెడ్డి, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్స్, పాస్ట్ గవర్నర్, క్లబ్ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక ఉల్లాసం : లక్ష్మీప్రసాద్‌రెడ్డి


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై 28: క్రీడలు శారీరక ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేశా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో క్రీడలకు సంబంధించి అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామన్నారు. ముఖ్యంగా యువత చెడు మార్గంవైపు పోకుండా క్రీడల వైపు ఆసక్తి చూపే విధంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఇప్పటికే జిల్లా స్పోర్ట్స్ ఆధ్వర్యంలో అన్ని మండలాలకు వాలీబాల్ కోర్టుల అభివృద్ధికి శ్రీకారం చుట్టామన్నారు. భవిష్యత్తులో కూడా ఇండోర్ స్టేడియం నిర్మించి జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, డాక్టర్ మహేశ్వరరాజు, కొండూరు శ్రీనివాసరాజు, టీడీపీ యువనేత రాహుల్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఖాదర్‌వలి, మురళీమోహన్‌రాజు, అర్బన్ సీఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమాజ హితం కోసం పనిచేద్దాం

చిట్వేలి, జూలై 28: సమాజ హితం కోసం నిస్వార్థంగా పనిచేస్తూ మానవతా సేవలను మండల వ్యాప్తంగా విస్తరింపజేయాలని చైర్మన్ తిరుమల విశ్వనాథం అన్నారు. చిట్వేలి మానవతా సభ్యుడు భద్రయ్య ఆచారి అందజేసిన పర్యావరణ హితమైన సంచులను మానవతా సభ్యులకు అందజేసి సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు. సమాజ హితం కోసం సహకారం అందించిన దాతను సభ్యులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ విశ్వనాథం, అధ్యక్షుడు మునిరావు, కార్యదర్శి సాయిరాం, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కును ఉపయోగంలోకి తీసుకురండి

లక్కిరెడ్డిపల్లె, జూలై 28: లక్కిరెడ్డిపల్లె పంచాయతీలో ప్రజల సౌకర్యార్థం 2018లో నిర్మించిన ఉద్యానవన పార్కును మరమ్మతులు చేయించి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వం పార్కులను అసలు పట్టించుకోకుండా వదిలేశారని, ప్రస్తుత ప్రభుత్వంలోనైనా పంచాయతీ అధికారులు చొరవ తీసుకొని గ్రామ పార్కులోని పిచ్చిమొక్కలను తొలగించి పార్కును ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రామాపురం, జూలై 28: మండల పరిషత్ సభాభవనంలో సోమవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

మైనార్టీల సమస్యలపై విశేష స్పందన

రాయచోటిటౌన్, జూలై 28: మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఎన్నికల్లో అండగా నిలిచిన రాయచోటి మైనార్టీల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించడం సంతోషంగా ఉందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని రకాలుగా అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్న మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

రేణుకా యల్లమ్మకు బోనాలు

గాలివీడు, జూలై 28: ఆషాఢ మాసం సందర్భంగా నూలివీడు గ్రామం ఆవుల రెడ్డిగారిపల్లె ప్రజలు రేణుక యల్లమ్మ అమ్మవారికి ఆదివారం బోనాలు సమర్పించారు. ప్రతి ఏడాది ఆషాఢమాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకోవడం గ్రామ ప్రజల ఆనవాయితీ. అమ్మవారికి బోనాలు సమర్పిస్తే సకాలంలో వర్షాలు కురుస్తాయని, పాడి పంటలు సంవృద్ధిగా పండుతాయని ప్రజల నమ్మకం.

రాష్ట్రాభివృద్ధికి కృషి చేద్దాం : టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

సిద్దవటం, జూలై 28: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ నేతలు పేర్కొన్నారు. మండలంలోని భాకరాపేటలో టీడీపీ నేత చెంచయ్యనాయుడు స్వగృహంలో ఆదివారం రాజంపేట టీడీపీ పార్లమెంట్ కార్యదర్శి నాగమోహన్‌రెడ్డి, టీడీపీ నేత చెంచయ్యనాయుడు, రాజంపేట యువ నాయకులు రాజానాయుడు పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి ఘనవిజయం సాధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాటిని వివరించేందుకు కలిసికట్టుగా ముందుకు రావాలన్నారు. స్థానిక జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం అందరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యకర్మంలో బీసీ సెల్ కార్యదర్శి రాజశేఖర్‌యాదవ్, నియోజకవర్గ అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్‌నాయుడు, ఒంటిమిట్ట ఎంపీటీసీ సభ్యుడు బాషా, జ్యోతి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

చెత్త కంపును భరించలేకున్నాం


చెత్తకుప్పను చూపిస్తున్న ప్రజలు

పెనగలూరు, జూలై 28: మండల కేంద్రంలోని రాజంపేట, పెనగలూరు ఆర్అండ్‌బీ రోడ్డుపక్కనే ఉన్న ఇండ్లూరు బస్టాప్ బ్రహ్మంగారి గుడి, ట్రాన్స్‌ఫార్మర్ల మధ్యలో నిత్యం చెత్త వేయడంతో కంపును భరించలేకున్నామని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు స్థానిక అధికారులకు తెలిపినప్పటికి ప్రయోజనం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్టాప్‌కు చుట్టుపక్కల ఉన్న దుకాణాలు, టిఫెన్ సెంటర్ల యజమానులు నిత్యం తడి, పొడిచెత్తను వేస్తున్నారు. పశువులు దాన్ని తొక్కి అక్కడే మలమూత్రాలు విసర్జించడం వల్ల దీని కంపు భరించలేకున్నామని ప్రజలు వాపోతున్నారు. దీనివల్ల బ్రహ్మంగారి గుడికి భక్తులు కూడా రావడం లేదని వాపోయారు. ఇదిలా ఉండగా గత ప్రభుత్వంలో ఈ చెత్త గురించి పంచాయతీ సిబ్బందికి, అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. ఇది పెనగలూరు ఎగువ హరిజనవాడ, అరుంధతివాడ, ముస్లిం కాలనీ, ఇండ్లూరు సత్తుపల్లె హరిజనవాడ గ్రామాలకు వెళ్లే ప్రధాన క్రాస్ కావడంతో ఇక్కడ ఉదయం నుంచి రాత్రి వరకు అధికంగా ప్రజల రాకపోకలు జరుగుతుంటాయి.

అన్నమాచార్యలో పుస్తకావిష్కరణ కార్యక్రమం


పుస్తకావిష్కరణ చేస్తున్న యాజమాన్యం

రాజంపేట, జూలై 28: రాజంపేట మండల పరిధిలోని అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో 'ఫౌండేషన్స్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ : థియరీ అండ్ ఇట్స్ అప్లికేషన్స్' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ చాన్సలర్ డాక్టర్ సి.గంగిరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకం అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు, ఐటీ రంగంలో పనిచేసే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్టర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు, ఏఐటీఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, పలువురు విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం పరిశుభ్రం

పెనగలూరు, జూలై 28: మండల కేంద్రంలో గత ప్రభుత్వంలో నిర్మించిన నూతన ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల్లో భాగా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, కంపచెట్లను పంచాయతీ సిబ్బంది పరిశుభ్రం చేయించారు. ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి ఆదేశంతో పంచాయతి కార్యదర్శి జేసీబీ ద్వారా పిచ్చిమొక్కలు, కంపచెట్లు తొలగించి శుభ్రం చేయించారు. కార్యాలయాల సముదాయంలో విపరీతంగా మొక్కలు పెరిగి విషపురుగులు సంచరిస్తుండడంతో స్థానికులు వీటి పరిశుభ్రతను అధికారులకు తెలియజేశారు. వెంటనే అధికారులు స్పందించి కార్యాలయాల సముదాయంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు.

పేద ప్రజల పక్షాన సీపీఎం పోరాటం

రైల్వేకోడూరు, జూలై 28: పేద ప్రజల పక్షాన సీపీఎం పోరాటాలు చేస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ అధ్యక్షతన ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో అనేక సమస్యలు తిష్ఠి వేసి ఉన్నాయని, పాలకులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంగంపేటలో అవినీతిపై విచారణ జరపాలని, ముగ్గురాయి విక్రయాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండు చేశారు. రాజంపేటలో అన్నమయ్య ప్రాజెక్టును తిరిగి పునరుద్ధరించాలని, కడప వయా రాయచోటి మీదుగా మదనపల్లెకు రైల్వే లైను ఏర్పాటు చేయాలన్నారు. రాయచోటి జిల్లా కేంద్రంకు రైల్వేకోడూరు నుంచి బస్సులు నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మణి, లింగాల యానాదయ్య, జాన్‌ప్రసాద్, ఓబిలి పెంచలయ్య, సుబ్బరామయ్య, శ్రీనివాసులు, హరి, సుజాత, గుర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

రామాపురం, జూలై 28: మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీలోని హరిజనవాడలో గత కొంతకాలంగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతుండడంతో గ్రామస్తులు ఈ విషయాన్ని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన ప్రత్యేక నిధులతో ఆ గ్రామానికి ఆదివారం బోరును వేయించారని మంత్రి సోదరుడు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన హరిజనవాడలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరు వద్ద కొబ్బరికాయలు కొట్టి బోరును ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత సేవలు భేష్ : రాహుల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్‌రెడ్డి

రాయచోటిటౌన్,జూలై 28: కుల, మత బేధాలు లేకుండా ఆపద సమయాల్లో సహాయం కోరిన వారికి నిష్పక్షపాతంగా సేవలు ఎనలేనివని టీడీపీ యువనేత మండిపల్లి రాహుల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో మానవతా నెలవారి సమావేశం జరిగింది. మానవతా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, కోశాధికారి మురళీమోహన్‌ల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాహుల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులకు రాయచోటి మానవత శాఖ చైర్మన్ శివగంగిరెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు సహదేవరెడ్డి, మాజీ అధ్యక్షుడు చింతంరెడ్డి వెంకట్రామిరెడ్డి, గౌరవాధ్యక్షుడు వెంకట్రమణలు ఘనస్వాగతం పలికి శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మానవత కుటుంబ సభ్యులతో పాటు నరేశ్, రెడ్డెప్ప, శ్రీను, నూరి, రోటరీక్లబ్ సభ్యులు హాజరయ్యారు.

నాగారపమ్మ తల్లికి బోనాలు



సుండుపల్లె, జూలై 28: మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లి సమీపంలో వెలసిన నాగారపమ్మ తల్లి ఆవరణంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టువస్త్రాలను అలయ అర్చకులు సమర్పించారు. మండలంతో పాటు రాయచోటి, పీలేరు, రాజంపేట వంటి ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి బోనాలను సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి తల నీలాలను సమర్పించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

సభ్యత్వాలు నమోదు చేయాలి

సుండుపల్లె, జూలై 28: మానవతా నెలవారీ సమావేశాన్ని ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మానవతా సంస్థ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీయూ విశ్రాంత ప్రిన్సిపాల్ సాంబశివారెడ్డి మాట్లాడుతూ మనవతా సంస్థ ద్వారా సేవలను మరింత విస్తరించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మహబూబ్‌బాషా, మానవతా చైర్మన్ గంగిరెడ్డి, సభ్యులు ఆరీఫుల్లా, హరికుమార్, శివకుమార్, ఆంజనేయులు, అమృనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: జనసేనపార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేనపార్టీ క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమాలు మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద ఏర్పాటు చేశారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉండాలని, అధినేత ఆశయాల మేరకు జనసేన పార్టీలో సభ్యత్వం పొందడం ద్వారా రూ.5 లక్షల జీవిత బీమా, రూ.50 వేల ప్రమాదబీమా వర్తిస్తాయని తెలిపారు. జనసేపార్టీ యువ నాయకులు బండి రమణ, కటికం నాగేంద్రల ఆధ్వర్యంలో సుమారు 150 మందికి పైగా సభ్యత్వం నమోదు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

జన సైనికుడు ప్రమాదవశాత్తు మృతి
జనసేనాని రూ.5 లక్షలు సాయం



మృతుడి భార్య రాజేశ్వరికి చెక్కును అందజేస్తున్న జనసేన నాయకులు

కల్లూరు, జూలై28: డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్‌కళ్యాణ్ పెద్ద మనసు చాటుకున్నారు. ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మృతి చెందిన జనసేన కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం చేశారు. పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లికి చెందిన జనసేన కార్యకర్త వెంకటరత్నం ఈ ఏడాది జనవరి 16న ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో జారి పడి మృతి చెందాడు. జనసేన కార్యకర్తలకు పార్టీ సభ్యత్వంతో పాటు బీమా సౌకర్యం కల్పించింది. దీంతో ప్రమాదవశాత్తు మృతిచెందిన వెంకట రత్నం కుటుంబానికి రూ.5 లక్షలు ఇవ్వాలని జనసేనాని పవన్‌కళ్యాణ్ నిర్ణయించి చెక్కును అందజేశారు. జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ చిన్నరాయల్ ఆదేశాల మేరకు పులిచెర్ల మండలం కల్లూరులో ఆదివారం మృతుడు వెంకటరత్నం భార్య రాజేశ్వరికి రూ.5 లక్షల నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం జనసేన పార్టీ గౌరవాధ్యక్షులు పోకల జనార్ధన్, మండల అధ్యక్షులు చంద్రబాబు మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తలకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అండగా ఉంటారనేందుకు ఇదే నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పుష్పరాజ్, వెంకీ, ధరణి, మనీష్, హరి, సునీల్, కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

పేరుకే అధికారంలో కూటమి

- వైసీపీ నేతల కనుసన్నల్లోనే పోలీసు వ్యవస్థ
- బీసీవై అధినేత ఘాటు విమర్శ

చిత్తూరు, జూలై 28: రాష్ట్రంలో పేరుకు మాత్రమే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, ఇప్పటికీ పోలీసు సహా కీలక వ్యవస్థలు వైసీపీ కనుసన్నల్లోనే ఉన్నాయని బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ విమర్శించారు. పోలీసుల తీరు చూస్తుంటే రాష్ట్రంలో జగన్ సీఎంగా, వైసీపీ అధికారంలో ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో ఏమైనా లోపాయకారి ఒప్పందాలు, రాజకీయాలు జరుగుతున్నాయా అనే అనుమానాలు ఉన్నాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ నాయకుడిని బెంగుళూరు ఎయిర్‌పోర్టులో అధికారులు పట్టుకుని రాష్ట్ర పోలీసులకు అప్పగిస్తే 41ఏ నోటీసు ఇచ్చి పంపడం ఏమిటని పేర్కొన్నారు. పుంగనూరులో 10 రోజుల క్రితం ఇరువర్గాలకు జరిగిన ఘర్షణలో ఎంపీ మిథున్ రెడ్డి సహా మాజీ ఎంపీ రెడ్డెప్ప తదితరులపై సెక్షన్ 307 కేసులు నమోదైనా, ఇంతవరకు అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అంగళ్ళు అల్లర్లలో చంద్రబాబుతో సహా పార్టీకి చెందిన వందలాదిమందిపై కేసులు పెట్టిన ఎస్పీ గంగాధర్‌ను కృష్ణా జిల్లా ఎస్పీగా పోస్టింగ్ ఇవ్వగా అక్కడ ఆయన వైసీపీ మాజీ మంత్రి కొడాలి నానితో కలిసి టీడీపీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నా ప్రభుత్వం పట్టనట్లు ఉందన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి కుటుంబానికి చెంచాగిరి చేసిన పోలీసు అధికారులను పలమనేరులో కీలక పోస్టింగ్స్‌లో స్థానిక ఎమ్మెల్యే నియమించుకోవడం లోపాయకారి ఒప్పందం కాదా అని ప్రశ్నించారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీసులో ఫైళ్ళ దహనం కేసులో ప్రధాన నిందితుడిని ఢిల్లీకి సాగనంపింది స్థానిక పోలీసులేనన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అనేక సంఘటనలను చూస్తుంటే వైసీపీ నేతల కనుసన్నల్లోనే పోలీసు వ్యవస్థ పనిచేస్తోందని స్పష్టమౌతోందన్నారు. సాధారణ ప్రజలకు కలుగుతున్న అనుమానాలపై ప్రభుత్వం సమీక్ష చేసుకోవాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

వచ్చేనెల్లో 'పెళ్లి కాని ప్రసాద్' విడుదల
- హీరో సప్తగిరి



సప్తగిరి, గురజాల జగన్మోహన్

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తాను నటించిన 'పెళ్లి కాని ప్రసాద్' సినిమా ఆగస్టులో విడుదల అవుతుందని హీరో సప్తగిరి తెలిపారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'పెళ్లి కాని ప్రసాద్' సినిమా చూస్తే అందరికి పెళ్లి అవుతుందని నవ్వుతూ అన్నారు. అలాగే ఈచిత్రంతో పాటు 'గోల్డ్‌మెన్' అనే చిత్రంలో కూడా నటిస్తున్నట్టు తెలిపారు. 'పెళ్లి కాని ప్రసాద్' స్క్రిప్ట్ చిత్తూరు ఎమ్మెల్యే ఓకే చేశారన్నారు. ఇక, 'మా' ఎన్నికల గురించి మీడియా ప్రశ్నించగా తప్పకుండా అన్నిటిలో మా ముద్ర ఉంటుందన్నారు. తర్వాత రాజకీయాల ప్రవేశంపై స్పందిస్తూ ఎంపీ సీటు కోసం ప్రయత్నించిన మాట వాస్తవమే కానీ.. చిన్నపిల్లోడిని అప్పుడే ఎందుకు రాజకీయాలు అని తర్వాత చూద్దాం అనుకున్నట్టు చెప్పారు. తర్వాత ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ.. ఎక్కడికక్కడ తిరుమలలో పరిశుభ్రత పెరగడంతోపాటు క్రమశిక్షణ కనిపిస్తోందన్నారు. సీఎం ఆదేశాలతో వచ్చిన అధికారులు మంచి సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. కొత్తగా వచ్చిన అధికారులు ఈదేవస్థానాన్ని ఇంకా ఉన్నత స్థానానికి తీసుకువెళతారని ఆశిస్తున్నట్టు చెప్పారు.

పాత కలెక్టరేట్‌కు పోలీసు భద్రత



చిత్తూరు కలెక్టరేట్, జూలై 28: 'మదనపల్లె' ఘటన నేపథ్యంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. రెవెన్యూ రికార్డుల భద్రతకు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో చిత్తూరులోని పాత కలెక్టరేట్‌లోని రికార్డు రూమ్‌కు భద్రత లేదంటూ ఈనెల 25న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో భద్రతా చర్యలు చేపట్టింది. మూడు రోజులుగా రెవెన్యూ పాత రికార్డుల భవనానికి 24గంటలూ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసింది. త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

వైసీపీ బురదజల్లేలా వ్యహరిస్తోంది
ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి



తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కనీసం గంట కూడా పదవిలో లేకుండా మాజీ సీఎం జగన్ ఉండలేని పరిస్థితిలో ఉన్నారని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 36 మంది వైసీపీ నాయకులను హత్య చేశారని జగన్ ఢిల్లీలో ధర్నా చేశారన్నారు. ఎవరు చనిపోయారు, వారి పేర్లు చెబితే విచారణ చేయిస్తామని పలుమార్లు సీఎం చెప్పినా సమాధానం చెప్పలేని పరిస్థితిలో వైసీపీ నాయకులు ఉన్నారన్నారు. కేవలం బురద చల్లేసి కడుక్కోండనే విధంగా జగన్ వ్యవహారం ఉందన్నారు. ప్రభుత్వంలో ఏదైనా లోటుపాట్లు ఉంటే ప్రశ్నించేలా ప్రతిపక్ష పాత్ర పోషించాలని కోరుకుంటున్నామన్నారు. గతంలో తాము కూడా కౌన్సిల్‌లో అనేక ప్రజా సమస్యలపై ప్రశ్నించామన్నారు. గతంలో టీటీడీలో అనేక అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందన్నారు. గతేడాది శ్రీవారి పరకామణిలో వందల కోట్ల కుంభకోణం జరగడం ఇటీవల బయటపడిందన్నారు. కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చ జరిగినప్పుడు మంత్రి ఆనం విచారణ చేయిస్తానని చెప్పారన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు

తిరుమల, జూలై 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కించి, ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 84,173 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 32,519మంది తలనీలాలు సమర్పించారు.

వైసీపీ స్వార్థం...ఆ పంచాయతీలకు శాపం

- టీడీపీ కంచుకోటలో గెలవాలని విలీనం.. కోర్టు స్టే ● నిధులు రాక ఆగిన అభివృద్ధి ● కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆశలు

పెనుమూరు, జూలై 28: వైసీపీ నేతల స్వార్థానికి మండలంలోని పెనుమూరు, చార్వాగానిపల్లి, పెద్దకలికిరి పంచాయతీలు బలయ్యాయి. పెనుమూరు, పెద్దకలికిరి పంచాయతీలు టీడీపీకి కంచుకోటగా ఉన్నాయి. గత ఐదు దఫాలుగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులే ఇక్కడ గెలుపొందారు. మండల కేంద్రం పెనుమూరులో ఎలాగైనా వైసీపీ జెండా ఎగురవేయాలని భావించిన ఆ పార్టీ నాయకులు పక్కనే ఉన్న చార్వాగానిపల్లి పంచాయతీని అందులో విలీనం చేయాలని భావించారు. అలాగే పెద్దకలికిరి పంచాయతీని రెండుగా విభజించి మొరవకండ్రిగను వేరుచేస్తే కనీసం ఒక్క పంచాయతీ అయినా గెలవచ్చని భావించారు. ఆ మేరకు 2019వ సంవత్సరంలో గుట్టుచప్పుడు కాకుండా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంచాయతీరాజ్ శాఖకు పంపించారు. మెర్జ్ గెజిట్ వచ్చాక ఈ విషయం ప్రజలకు తెలిసింది. ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు వస్తున్న రోజు కూడా అధికార పార్టీ నాయకులు మాత్రమే పంచాయతీ కార్యాలయానికి చేరుకుని పంచాయతీల విభజనకు తమకు అభ్యంతరం లేదని తెలిపారు. దీంతో అధికారులు పంచాయతీ మెర్జింగ్, డివైడింగ్ ప్రక్రియను పూర్తి చేసి, ప్రొసీడింగ్స్‌ను అన్ని శాఖలకు పంపించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు కోర్టును ఆశ్రయించగా స్టే విధించింది.



కలికిరి సచివాలయం

అభివృద్ధి ఊసే లేని చార్వాగానిపల్లి, పెద్దకలికిరి

చార్వాగానిపల్లి అసలే చిన్న పంచాయతీ.. నిధులు అంతంతమాత్రమే.. ఇక పెనుమూరులో విలీనం చేయడం, కోర్టు స్టే విధించడంతో అభివృద్ధి పనులు ఏవీ జరగలేదు. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, లైబ్రరీ భవనాల లాంటివి మంజూరుకాలేదు. డ్రైనేజీ, రోడ్ల ఊసేలేదు. వీధి దీపాలు కావాలన్నా సచివాలయంలో అడిగితే పెనుమూరులో అడగాలని చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. గ్రామాల్లో క్లోరినేషన్ చేసి రెండేళ్లయ్యింది. పెద్దకలికిరి పంచాయతీ పరిస్థితి కూడా ఇదే తరహాలో ఉంది.

ఉపాధి, హౌసింగ్ బిల్లులకు బ్రేక్

చార్వాగానిపల్లి పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో 60 మంది కూలీలు ఉన్నారు. వీరు పనులు చేయాలన్నా పంచాయతీ పేరు చూపక పోవడంతో అధికారులు అంచనా వ్యయం వేయలేకపోతున్నారు. హార్టికల్చర్ ద్వారా పండ్ల తోటలు పెంచుతున్న రైతులకు బిల్లులు ఆరు నెలలుగా పెట్టలేదు. హౌసింగ్‌లో 26 మంది లబ్ధిదారులకు కొంత మొత్తం ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. వాటికి కూడా బ్రేక్ పడింది. ఉపాధి హామీ ఫీల్డ్ ఆఫీసర్‌ను ఉద్యోగం నుంచి తీసేశారు.

రూ.కోటి నిధులు వెనక్కు..

కోర్టులో స్టే ఉండటంతో మూడు పంచాయతీల్లో సర్పంచ్ ఎన్నికలు ఆగిపోయాయి. దీంతో నిధులకు బ్రేక్ పడింది. పెనుమూరు పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు ఏడాదికి రూ.22 లక్షలు చొప్పున మూడేళ్లకు రూ.66 లక్షలు ఆగిపోయాయి. చార్వాగానిపల్లి పంచాయతీకి ఏడాదికి రూ.5 లక్షల చొప్పున మూడేళ్లకు 15 లక్షలు, పెద్దకలికిరి పంచాయతీకి ఏడాదికి రూ.8.50 లక్షల చొప్పున రూ.25.5 లక్షలు ఆగిపోయాయి. ఈ క్రమంలో ఏ చిన్న అభివృద్ధి పని కూడా అధికారులు చేయలేకపోతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పంచాయతీల మెర్జింగ్ వ్యవహారంపై దృష్టి సారించి న్యాయం చేస్తుందని ప్రజలు కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.



చార్వాగానిపల్లి సచివాలయం

వైసీపీ నేత లీలలు?

- ఆర్సీపురం మండలంలోని స్థలానికి తిరుపతి రూరల్‌లో ఫేక్ రికార్డులు
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారుల సహకారంతో రూ.కోటి స్థలం స్వాహా
- న్యాయం కోసం తిరుగుతున్న బాధితుడు

భూమి ఉండేది రామచంద్రాపురం మండలం పరిధిలో అయితే తిరుపతి రూరల్ మండలం తహసీల్దార్ ధ్రువీకరించినట్లు నకిలీ రికార్డు తయారైంది. వాటికి రూరల్ సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ కూడా చేసేశారు. ఫలితంగా రూ.కోటి విలువైన భూమి ఓ వైసీపీ నేత ఖాతాలోకి చేరిపోయింది. ఆలస్యంగా ఈ విషయం భూ యజమానికి తెలిసి కుయ్యోమొర్రోమంటూ రెండేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం కానరాలేదు. ప్రభుత్వం మారిన తర్వాతైనా న్యాయం జరుగుతుందని వేచిచూశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కొత్త కలెక్టర్‌ను గ్రీవెన్స్‌లో కలిశారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులు కుమ్మక్కై వైసీపీ నేతకు తన భూమిని ఎలా కట్టబెట్టారో ఆధారాలతో ఫిర్యాదు చేశారు. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతిలో నివసించే కె.పురుషోత్తమ రెడ్డికి రామచంద్రాపురం మండలం సి.రామాపురం గ్రామంలో సర్వే నెంబరు 73/3లో 2.32 ఎకరాల పూర్తి విస్తీర్ణ భూమికి 1959 నుంచి రికార్డు ఉంది. 2022 ఏప్రిల్‌లో అనుమానం వచ్చి కొత్త అడంగల్ పరిశీలించగా 10 సెంట్ల భూమి తగ్గి 2.22 ఎకరాలని చూపించింది. ఖంగుతిన్న బాధితుడు రికార్డులను పరిశీలించగా విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. ఆర్సీపురం, తిరుపతి రూరల్ మండల ఉద్యోగులు కుమ్మక్కై తన భూమిలోని 10 సెంట్లను వేరే వ్యక్తికి ఇచ్చినట్లు తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ ద్వారా జారీ అయినట్లు నకిలీ 1-బీ, అడంగల్ ప్రైవేట్ మీ-సేవ లేదా ఇంటర్నెట్ సెంటర్లో సృష్టించినట్టు గుర్తించారు. ఆ తర్వాత ఈ భూమిని స్థానిక జడ్పీటీసీ డిల్లీరాణి (భర్త వైసీపీ నేత భానుకుమార్ రెడ్డి) పేరున డాక్యుమెంట్ నెంబరుగా (2282/2022)గా రిజిస్టర్ చేసేశారు. ఆర్సీపురం తహసీల్దార్ కార్యాలయంలో గతంలో ఆర్ఐగా పనిచేసిన జీవన్‌రెడ్డి ప్రధాన సహకారంతో వైసీపీ నేత వి.భానుకుమార్ రెడ్డి ఆ భూమిని తన భార్య డిల్లీరాణి పేరిట రిజిస్టర్ చేసుకున్నారు. ఈ లావాదేవీల్లో వీఆర్వో ప్రసాద్, డీటీ మునిశైలజ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ బాషా, సి.రామాపురం విలేజ్ సర్వేయర్ హర్షవర్ధన్‌లకు ప్యాకేజీ మొత్తం ఆర్ఐ జీవన్ ద్వారా పంచి.. భూమిని కొల్లగొట్టాడని ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నారు. దీనిపై రెండేళ్లుగా కలెక్టర్, ఆర్డీవో, జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినా వారు విచారణ జరపడం లేదని వాపోయారు. ఆర్డీవో కార్యాలయంలో విచారణ జరపకుండా కొందరు సిబ్బంది అడ్డుపడుతున్నారని, భూ కుంభకోణానికి బాధ్యులైన ప్రభుత్వ ఉద్యోగులపై విచారణ జరిపి.. తగు చర్యలు తీసుకుని, 10 సెంట్ల భూమిని తిరిగి తన ఖాతాలో ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని బాధితుడు కోరుతున్నారు.



ఆర్సీపురం మండలంలోని భూమి

భక్త జనసంద్రంగా బోయకొండ





అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచియున్న భక్తులు, కొండపైకి వెళ్లే మార్గంలో నిలిచి పోయిన కార్లు



ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, జూలై28: బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో భక్త జనసంద్రంగా మారింది. ఆషాడ మాసం నాలుగో ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అమ్మవారి దర్శనానికి 2 గంటల సమయం క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. సుమారు 40 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొండపై నుంచి కొండ కింద వరకు రెండు కిలోమీటర్ల పొడవునా కార్లు నిలిచిపోవటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆలయ ఈవో ఏకాంబరం భక్తులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దర్గాగా కుంట కబ్జా

- వైసీపీ నేత చెరలో బాలేకుంట
- మామిడి, టెంకాయ, జామ సాగు
- మూగజీవాలకు తీరని దాహార్తి

పుంగనూరు, జూలై 26 : అధికారంలో ఉండగా కబ్జాకు కాదేదీ అనర్హం అన్నట్లు వ్యవహరించారు వైసీపీ నేతలు. చెరువులు, కుంటలు, పొలాలు ఇలా ఏది ఖాళీగా కనిపిస్తే అక్కడ పాగా వేసేశారు. ఇందులో భాగంగా పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ సర్వేనెంబరు 476లో 7-86 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బాలేకుంటను వైసీపీ నేత కృష్ణారెడ్డి ఆక్రమించాడు. కుంటలో నీరు నిల్వ చేరకుండా చేసి, మామిడి, జామ, టెంకాయ చెట్లు పెట్టాడు. భూములకు, పశువులకు, జీవాలకు ఆ కుంట ఎంతో ఉపయోగంగా ఉండేదని, దాన్ని ఆక్రమించి వ్యవసాయ భూములుగా మార్చుకుంటున్నారని గ్రామస్తులు, రైతులు పలు పర్యాయాలు రెవిన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. కుంటలో గతంలో వేసిన తాగునీటి బోరును, పైపులైన్‌ను వాడుకుంటున్నాడని పేర్కొన్నారు. గ్రామంలో నీటి సమస్య ఉన్నా బోరు నుంచి నీరు ఇవ్వడంలేదని తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తొలగించి, కుంట కట్ట తెంచేశారని వాపోయారు. దీనిపై ప్రశ్నిస్తే కొడవళ్లతో దాడి చేయడానికి వస్తున్నారన్నారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఉండడంతో అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేకపోయారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి బాలేకుంటను రక్షించాలని కోరుతున్నారు.



బాలేకుంటలో వైసీపీ నేతలు నాటిన మామిడి మొక్కలు

ప్లాస్టిక్ రహిత వర్సిటీగా మారుస్తాం

ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 28: ఎస్వీయూను ప్లాస్టిక్ రహితంగా మార్చడానికి ప్రయత్నిస్తామని రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఆదివారం ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. వీరిని ఈ సందర్భంగా రిజిస్ట్రార్ అభినందించారు. అనంతరం భూపతి నాయుడు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వ్యర్థాలు జీవుల మనుగడకు అవరోధమన్నారు. పర్యావరణానికి కూడా ఎక్కువ హాని కలుగచేస్తాయని చెప్పారు. క్లీన్ క్యాంపస్ - గ్రీన్ క్యాంపస్ కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం విద్యార్థులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు వేమూరి జయరాం ప్రసాద్, సభ్యుడు శివాజీ, సామాజిక కార్యకర్తలు మార్కండేయ, ధరణి, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారుల ఎంపిక

తిరుపతి(క్రీడలు), జూలై 28: స్థానిక జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో ఆదివారం 24వ చిత్తూరు జిల్లా తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2024 బాలబాలికల సబ్ జూనియర్, ఓపెన్ క్యాడెట్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, జిల్లా తైక్వాండో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరి శంకర్‌యాదవ్ హాజరై క్రీడాకారులకు విలువైన సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం మూడు విభాగాల్లో పోటీలు జరిగాయి. జయరామయ్య, విజయ్‌కుమారి, క్రాంతికుమార్, మనోహర్ నాయుడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన గాలి..దుమ్ము
రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతి చెందిన రామ్ చరణ్ (ఫైల్‌ఫొటో)

పుంగనూరు రూరల్,జూలై28: ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు.. పుంగనూరు చింతలవీధికి చెందిన సురేష్ కుమారుడు రామ్‌చరణ్(17)మదనపల్లెలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆడికృత్తిక మాసం సందర్భంగా పుంగనూరు మండలం నెక్కొంది కొండపై వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి స్నేహితులైన సందీప్, ప్రదీప్‌తో కలసి ద్విచక్రవాహనంలో వెళ్లాడు. దర్శనం తర్వాత తిరిగి వస్తుండగా బండ్లపల్లె క్రాస్ వద్ద విపరీతమైన గాలికి కంట్లో దుమ్ముపడి ద్విచక్రవాహనం అదుపు తప్పి విద్యుత్‌స్తంభానికి ఢీకొంది. ఈ ఘటనలో వాహనం నడుపుతున్న రామ్‌చరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక ఉన్న సందీప్, ప్రదీప్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ సుబ్బారెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. రామ్‌చరణ్ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు





చంద్రశేఖర్ మృతదేహం, మృతుడి ఓటరు గుర్తింపు కార్డు

గుడిపాల, జూలై 28: చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరొకరు తీవ్రం గా గాయపడ్డారు. ఎస్ఐ నరేంద్ర కుమార్ కథనం మేరకు గుడిపాల నుంచి చిత్తూరు వైపు ద్విచక్ర వాహనంపై కట్టకిందపల్లి దళితవాడకు చెందిన చంద్రశేఖర్, అరుల్‌పురానికి చెందిన దినకర్ వస్తున్నారు. చిత్తూరు నుంచి వేలూరు వైపు వెళ్తున్న కారు లక్ష్మీపురం వద్ద వీరి వాహనాన్ని ఢీకొంది. దీంతో చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. దినకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడ్ని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆడికృత్తికకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 28: ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని తమిళనాడు తిరుత్తణితో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. భక్తుల సౌకర్యార్థం సోమ, మంగళవారాల్లో తిరుపతి-తిరుత్తణి వయా నగరి మీదుగా, పచ్చికాపల్లం-తిరుత్తణి వయా కె.నగరం 20, పుత్తూరు-తిరుత్తణి వయా నగరి 12, నగరి-తిరుత్తణి 5, కొత్తపల్లెమిట్ట-తిరుత్తణి వయా నగరి 15, పుత్తూరు వయా పల్లెపట్టు 6, సత్యవేడు-తిరుత్తణి వయా నాగలాపురం 15, నాగులాపురం-తిరుత్తణి 5, తిరుపతి-పాకాల 5 బస్సులు నడవనున్నాయి.

ఆక్రమణలో జూనియర్ కళాశాల స్థలాలు

● ఇష్టారాజ్యంగా నిర్మాణాలు ● గత వైసీపీ హయాంలో అడ్డూ అదుపులేకుండా ఆక్రమణలు
● పట్టించుకోని అధికారులు




హైల్యాండ్ మైదానంలో అక్రమ నిర్మాణాలు

వాల్మీకిపురం, జూలై 28: వాల్మీకిపురం పట్టణంలోని మదనపల్లె మార్గంలో ఉన్న పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన హైల్యాండ్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గత అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వ అండదండలతో ఇష్టారాజ్యంగా నిర్మాణాలకు తెరలేపిన దృశ్యాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 1975 నాటి రోజుల్లో అప్పటి పోలేపల్లె కుటుంబీకులు సర్వే నెంబరు 1357-1ఎ నందు 3.70ఎకరాల స్థలాలను విరాళంగా అందజేశారు. తరువాత 2013 నాటి రోజుల్లో జిల్లా కలెక్టర్ ద్వారా హైల్యాండ్ స్థలాలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కేటాయించడం జరిగింది. ఇక అప్పటి నుంచి ఆస్థలాలకు ఎలాంటి రక్షణ లేకుండా పోయింది. ఎటు చూసినా ఆక్రమ నిర్మాణాలే దర్శనమిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కళాశాలకు చెందిన ఈ స్థలాలలో అనుమతులు లేకుండానే అంగన్‌వాడీ కేంద్రం భవనాల నిర్మాణాలు కూడా చేపట్టేశారని సమాచారం. రోజు రోజుకు హైల్యాండ్ మైదానం స్థలాలు కబ్జాకు గురవుతుండటం గమనార్హం. అంగన్‌వాడీ కేంద్రం భవనాలతో పాటుగా అప్పటి వైసీపీ అధికార అండతో ఏకంగా ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టేశారు. ఇదంతా కూడా అధికారుల అండదండలతోనే జరుగుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. 3.70 ఎకరాల జూనియర్ కళాశాలకు చెందిన స్థలాలు రోజురోజుకు కుంచించుకు పోతున్నాయి. కొందరు వైసీపీ నాయకులు ఈ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు మంజూరు చేయిస్తామని పైరవీలు సాగించినట్లు సమాచారం. కొందరైతే ఏకంగా ఇంటి పట్టాలు ఇప్పిస్తామని రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. హైల్యాండ్ మైదానంలో నిర్మించిన బస్‌షెల్టర్, సమీపంలో అక్రమంగా బంకులు, నిర్మాణాలతో స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. ఒకప్పుడు ఎంతో విశాలంగా క్రీడాకారులకు ఎంతో గుర్తింపుగా ఉండే హైల్యాండ్ మైదానం నేడు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకునేవారులేరు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ జూనియర్ కళాశాల యాజమాన్యం, అధికారులు దృష్టి సారించి కళాశాలకు చెందిన హైల్యాండ్ స్థలాలను కబ్జాదారుల కబంధహస్తాల నుంచి పరిరక్షించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


హైల్యాండ్ మైదానంలో బస్‌షెల్టర్, అక్రమణలు


వాల్మీకిపురం సమీపంలోని హైల్యాండ్ మైదానం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం..

వాల్మీకిపురం సమీపంలోని పింగాణి ఫ్యాక్టరీ ప్రాంతంలో ఉండే హైల్యాండ్ మైదానం స్థలాలు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించినవే. 2019, 2022లలో రెండు సార్లు సర్వే నిమిత్తం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. హైల్యాండ్ మైదానంలో అక్రమ నిర్మాణాలు, కబ్జాల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం, ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. హైల్యాండ్ స్థలాలు పూర్తిగా జూనియర్ కళాశాలకు సంబంధించినవే. అక్రమ నిర్మాణాలు, అక్రమణలపై ఖచ్చితంగా చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- ఉమా అమరేశ్వరి, ప్రిన్సిపాల్, పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, వాల్మీకిపురం

రికార్డుల దహనంలో పెద్దిరెడ్డి హస్తం ఉంది

● భూ ఆక్రమణలు బయటపడుతాయనే రికార్డులు కాల్చేశారు
● తంబళ్లపల్లెలో రెండు వేల ఎకరాలకుపైగా భూ ఆక్రమణలు
● తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూలై 28: మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన రికార్డుల దహనంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హస్తం ఉన్నట్లు బయటపడుతోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఆరోపించారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ ఆక్రమణలు బయటపడుతాయని పెద్దిరెడ్డి మనుషులు కుట్రపూరితంగా రికార్డులు కాల్చేశారన్నారు. మదనపల్లె ఘటనకు సంబంధం ఉన్న ఏ ఒక్కరినీ ప్రభుత్వం వదలదన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో రెండు వేలకుపైగా భూములను పెద్దిరెడ్డి కుటుంబం బినామీ, అనుచరుల పేర్లతో ఆక్రమించుకుందన్నారు. నియోజకవర్గంలోని భూ బాధితులకు ఖచ్చితంగా న్యాయం చేస్తామని భూ బాధితులు ముందుకొచ్చి వివరాలు అధికారులకు అందజేయాలన్నారు. ఎవరికైనా భయం ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో గత వైసీపీ పాలనలో అక్రమంగా తరలించి నిల్వ చేసిన ఇసుకను కూటమి ప్రభుత్వం రాగానే సీజ్ చేయడం జరిగిందన్నారు. నియోజక వర్గంలో ఇప్పటి వరకు 60వేల టన్నులు ఇసుకను అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఇసుక నిల్వల విలువ రూ.24 కోట్లు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నాయకులు శంకర్‌రెడ్డి, లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను సత్వరం పూర్తిచేయాలి

● నేటి నుంచి ఏపీ రైతు సంఘం రాష్ట్ర స్థాయి సమ్మేళనం


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు

మదనపల్లె అర్బన్, జూలై 28: రాయలసీమ జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న తాగునీటి, సాగునీటి ప్రాజెక్టులు సత్వరం పూర్తిచేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరయ్య, కేవీవీప్రసాద్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నుంచి మూడు రోజులపాటు మదనపల్లె కేంద్రంగా ఏపీ రైతు సంఘం రాష్ట్రస్థాయి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీయూ భవనంలో రైతు సంఘం నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ జూలై 29, 30, 31న స్థానిక పట్టణంలోని ఎన్వీఆర్ కళ్యాణ మండపంలో ఏపీ రైతుసంఘం రాష్ట్ర స్థాయి సమ్మేళనం జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సెమినార్‌కు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, మాజీ వ్యవసాయశాఖామాత్యులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ఇతర రాష్ట్ర రైతు నాయకులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు తోపు కృష్ణప్ప, సాంబశివ, మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి మురళి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిముళ్ల రంగారెడ్డి, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి తిరుమలరెడ్డి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆడికృత్తిక మహోత్సవాలకు కావళ్లతో తరలిన భక్తులు


మంజునాథ స్వామి ఆలయం వద్ద కావళ్లతో ఉన్న భక్తులు

మదనపల్లె అర్బన్, జూలై 28: తమిళనాడు రాష్ట్రంలోని తిరుత్తణిలో ఈనెల 30 నుంచి జరిగే ఆడికృత్తిక మహోత్సవాలకు మదనపల్లె నుంచి భక్తులు కావళ్లతో ఆదివారం బయలుదేరి వెళ్లారు. మదనపల్లెలోని రంగారెడ్డికాలనీ, కొత్తయిండ్లకు చెందిన భక్తులు సుమారు 20మంది ప్రతి ఏటా తిరుత్తణిలోని సుబ్రహ్మణ్యం స్వామి ఆయానికి బయలుదేరి స్వామివారికి కావళ్లు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆడికృత్తి సందర్భంగా తిరుత్తిణిలో వైభవంగా కావళ్ల పండుగ నిర్వహిస్తారని ముందుగా సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో తమ కుటుంబసభ్యులతో పూజలు నిర్వహించామని భక్తులు తెలిపారు. మదనపల్లె మండలంలోని రామాచార్లపల్లె పంచాయతీలో వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యంస్వామి ఆలయంలో ఈ నెల 30న ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయధర్మకర్తలు రాచపల్లె సుబ్రహ్మణ్యం, అనురాధలు తెలిపారు. ఈ సందర్భంగా కావళ్లపండుగకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామికి ప్రత్యేక అర్చనలు, విశేషపూజలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేసినట్లు వారు చెప్పారు. స్థానిక వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 30 ఆడికృత్తిక సందర్భంగా ఆలయంలో సుబ్రహ్మణ్యంస్వామికి విశేషపూజలు నిర్వహిస్తునట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

ముమ్మరంగా జనసేన సభ్యత్వ నమోదు


జనసేన పార్టీ సభ్యత్వాలు చేస్తున్న శ్రీరామ రామాంజనేయులు

మదనపల్లె అర్బన్, జూలై 28:జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నాల్గో విడత స్థానిక చిత్తూరు బస్టాండ్‌లో ఆదివారం నిర్వహించినట్లు ఆ పార్టీ నేత శ్రీరామ రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో 700పైగా చేయించామన్నారు. సభ్యత్వ నమోదులో జిల్లాలోని మదనపల్లె నియోజకవర్గ ప్రథమ స్థానంలో నిలిపామన్నారు. జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో కూటమి పాలనలో ప్రజా సంక్షేమం నెలకొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జగదీష్, సోను, నవాజ్, లతీఫ్, అవినాష్, సత్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి వీడ్కోలుతో మాజీ జడ్పీటీసీ అంత్యక్రియలు


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం

ములకలచెరువు, జూలై 24: ములకలచెరువు మాజీ జడ్పీటీసీ, తంబళ్లపల్లె నియోజకర్గ టీడీపీ నేత కువైట్ శంకర్ కు కుటుంబీకులు, బంధువులు, స్నేహితుల కన్నీటి వీడ్కోలుతో అంత్యక్రియలు పూర్తి చేశారు. అనారోగ్యంతో మాజీ జడ్పీటీసీ కువైట్ శంకర్ మృతి చెందిన విషయం విదితమే. ఆయన పార్థివ దేహాన్ని ఆదివారం ఉదయం స్వగ్రామైన బత్తలాపురంకు తీసుకెళ్ళారు. అక్కడ తంబళ్లపల్లె, రాజంపేట నియోజక వర్గ టీడీపీ నేతలు దాసరిపల్లి జయచంద్రారెడ్డి, సుగవాసి బాలసుబ్రమణ్యం, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, చిత్తూరు జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ గిరివాణి చంద్రప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే లక్ష్మదేవమ్మ, జనసేన ఇన్‌చార్జ్ పోతుల సాయినాథ్, బీజేపీ నేత చల్లపల్లి నరసింహారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు పాల గిరి సిద్ధా, వైజీ సురేంద్రయాదవ్, ఆనందరెడ్డి, నారాయణస్వామిరెడ్డి, రాజంపేట పార్లమెం టు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, కేవీ రమణ, చెన్నకిష్టా, ఆర్‌జే వెంకటేష్, ముత్తుకూరు మౌళా, జేసీబీ సుధాకర్ నాయుడు, వెంకటస్వామి టీడీపీ శ్రేణులు అంత్యక్రియలకు హాజరయ్యారు. కువైట్ శంకర్ మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. అలాగే ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ఘన సన్మానం



మదనపల్లె అర్బన్, జూలై 28: సేవలకు గుర్తింపుగా భరతముని అకాడమీ ఆధ్వర్యంలో రొమ్మాల మునికృష్ణారెడ్డి పేరిట ఆయన వర్ధంతిని పురస్కరించుకుని టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ రామమూర్తిని పూలమాలలతో దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఆదివారం జ్ఞానోదయ పాఠశాల్లో చైతన్య భారతి సంపత్‌కుమార్ భరతముని ఆర్ట్స్ అకాడమీ ద్వారా ఏర్పాటు చేసిన సమావేశంలో సన్మానించారు. జ్ఞానోదయ స్కూల్ కరస్పాండెంట్ ప్రసాద్ మాట్లాడుతూ మునికృష్ణారెడ్డి తమ విద్యాసంస్థలతో సుదీర్ఘమైన అనుబంధం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య స్రవంతి అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు కురలి వెంకటరమణ, శకుంతలమ్మ, నాగరాజ, లైబ్రేరియన్ వసంతకుమారి, రామ్మోహన్‌రెడ్డి, రంగనాథాచార్యులు, వాసా కృష్ణమూర్తి, మునిగోపాలకృష్ణ, జగన్మోహన్, శ్రీధర్, శ్రీనివాసులు నాయుడు, సురేష్, హరినాథబాబు, తదితరులు పాల్గొన్నారు. సన్మానించారు.

వ్యవసాయ పొలం వద్ద స్టార్టర్, కేబుల్ వైరు చోరీ

కురబలకోట, జూలై 28: మండలంలోని దాదంవారిపల్లె పంచాయతీ కోటకొండ రోడ్డు పక్కనున్న వ్యవసాయ పొలంలో రేకుల షెడ్డును ధ్వంసం చేసి స్టార్టర్, కేబుల్ వైరును గుర్తుతెలియన దుండగులు చోరీ చేసిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. దీనికి సంబంధించి బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదనపల్లెకు చెందిన ఎం.రాఘవరెడ్డి డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా ఆయన తన పొలంలో వ్యవసాయం చేస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి స్టార్టర్, కేబుల్ వైరును దొంగలించుకెళ్లారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముదివేడు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

గుర్రంకొండ, జూలై 28:కోడిపందేలపై పోలీసులు దాడులు నిర్వహించి 9 మందిని అరెస్టు చేసినట్లు ఏఎస్‌ఐ నరసింహులు తెలిపారు. ఆయన వివరాల మేరకు మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ బొడ్డిగుట్ట సమీపంలోని పొలాల్లో కోడి పందెం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వాల్మీకిపురం సీఐ పులిశేఖర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మంది పట్టుబడగా, వారి వద్ద నుంచి రూ.13,300 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్ని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

'మానవత' నూతన అధ్యక్షుడిగా శెట్టి సుబ్రహ్మణ్యం


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గసభ్యులు

పీలేరు, జూలై 28: మానవత సంస్థ పీలేరు శాఖ నూతన అధ్యక్షుడిగా శెట్టి సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. 2024-25 సంవత్సరానికి మానవత సంస్థ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగింది. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా శెట్టి సుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా బొగ్గారపు వెంకట సురేశ్, కోశాధికారిగా జగన్మోహన్ ఎన్నికైనట్లు సంస్థ చైర్మన్ రామచంద్ర తెలిపారు. అదే విధంగా కో-చైర్మన్‌గా ఆర్.కృష్ణమూర్తి, కన్వీనర్‌గా యర్రంశెట్టి వెంకటరమణ, సభ్యులుగా ఎం.లక్ష్మీప్రసాద్ నాయుడు, టి.రహత్ బాషా, జీవీ రమణ, విజయకుమారి, నాగరాజా, రెడ్డప్ప ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. కొత్తగా ఎన్నికైన వారిని మిగిలిన సభ్యులు అభినందించారు.

రోడ్డుప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

బి.కొత్తకోట, జూలై28: బి.కొత్తకోట మండల పరిధిలోని బీరంగి పంచాయతీ కంబాలపల్లె వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శివకుమార్(28)అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. తన స్వగ్రామం కాసిపల్లె నుంచి ద్విచక్రవాహనంలో బి.కొత్తకోటకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఓ ప్రైవేటు బస్సు ఢీకొంది. దీంతో తీవ్రగాయాల పాలయ్యాడు. అతనిని హుటాహుటిన 108లో మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా తపస్విని

నిమ్మనపల్లి, జూలై 28: నిమ్మనపల్లి మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా తపస్విని ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ బాలాజీ రాజు అనంతపురం బదిలీ కావడంతో నిమ్మనపల్లిలో డీటీగా పనిచేస్తున్న తపస్వినికి ఇన్‌చార్జి బాధతలు అప్పగించినట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

ఆస్కార్‌రావు వ్యాఖ్యలు బాధాకరం

మదనపల్లె టౌన్, జూలై 28: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణను బహిష్కరించామని, ఆస్కార్ రావు వ్యాఖ్యానించడం బాధకరమని ఏపీ ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు ఖండించారు. ఆదివారం స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద సమావేశమైన ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్ల కోసం సూర్యనారాయణ పోరాడుతున్నారన్నారు. ఆయన నాయకత్వంలోనే తాము పనిచేస్తామన్నారు.

వైభవంగా యల్లమ్మ దేవత జాతర


వాల్మీకిపురంలో పూజలందుకుంటున్న యల్లమ్మ దేవత


కలకడలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


కలకడలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

వాల్మీకిపురం, జూలై 28: వాల్మీకిపురం మండలంలోని టి.సాకిరేవుపల్లెలో ఆదివారం యల్లమ్మ దేవత జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదాతపూర్వం నుంచి అమ్మవారికి అభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకి అన్న ప్రసాద వితరణ చేపట్టారు. నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నేత కృష్ణారెడ్డి ప్రజలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు బోనాల పండుగ

కలకడ, జూలై 28:మండలంలోని రాతిగుంటపల్లె గ్రామదేవత ముత్యాలమ్మకు ఆదివారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి నైవేథ్యం సమర్పించారు. రాతిగుంటపల్లె, ఎగువబొంతవారిపల్లె, దిగువబొంతవారిపల్లె, శ్రీనివాసపురం కాలనీలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. కాగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆయన సతీమణి తనూజరెడ్డిలు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. రాతిగుంటపల్లె సర్పంచ్ అలివేలమ్మ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాశ్, పొత్తూరి ప్రభాకర్‌నాయుడు, నాయకులు బరకం శ్రీనివాసులరెడ్డి, మద్దిపట్ల వెంకటరమననాయుడు, మల్లికార్జుననాయుడు, కొనేని ఆనంద్‌నాయుడు, పీవీనాయుడు, వసంతనాయుడు, జనార్ధన్‌నాయుడు, రైస్‌మిల్ రమణ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో యల్లమ్మ తల్లికి బోనాలు

పీలేరు, జూలై 28: పీలేరు పట్టణం చిత్తూరు రోడ్డు మోడల్ కాలనీలోని యల్లమ్మ తల్లికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ధర్మకర్త దేవిరెడ్డి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాస దీక్షితులు, పూజారి శ్రీరాములు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి తోమాల, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. బోనాల సందర్భంగా అమ్మవారిని మోడల్ కాలనీతోపాటు పీలేరు పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు కూడా పెద్దఎత్తున దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

టీడీపీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం


బి.కొత్తకోట టీడీపీ నాయకులతో చంద్రప్రకాష్

బి.కొత్తకోట, జూలై28: తెలుగుదేశం పార్టీకి కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తలందరికీ పార్టీ అధినేత చంద్రబాబు న్యాయం చేస్తారని ఆ పార్టీ చిత్తూరు పార్లమెంట్ కోఆర్డినేటర్ గీర్వాణిచంద్రప్రకాష్ పేర్కొన్నారు. బి.కొత్తకోటలో తంబళ్లపల్లె నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు నివాసంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉండగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో టీడీపీ నాయకులు కార్యకర్తలపై పెట్టిన కేసులు, చేసిన దౌర్జన్యాలు అధినేతకు బాగా తెలుసునని అప్పట్లో నష్టపోయిన, బాధలు పడిన ప్రతి కార్యకర్తకు పార్టీ న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కుడుంశ్రీనివాసులు, రంజిత్, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ సురేంద్ర, మాజీ జడ్పీటీసీ ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

అజాగ్రత్త చేస్తే హెపటైటిస్ ప్రాణాంతకం కావచ్చు


హెపటైటిస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

పీలేరు, జూలై 28: సరైన సమయంలో వైద్యం తీసుకోకుండా అజాగ్రత్త వహిస్తే హెపటైటిస్ వ్యాధి ప్రాణాంతకం అవుతుందని పీలేరు మండలం తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రశేఖర్ నాయక్ పేర్కొన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన కోటపల్లె బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు హెపటైటిస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెపటైటిస్ చాలా ప్రమాదకరమైన కాలేయ సంబంధిత వైరల్ అంటు వ్యాధి అని, శుభ్రత లేని ఆహారం, నీరు, కలుషితమైన రక్తం ద్వారా అది ప్రబలుతుందన్నారు. 2030 నాటికి మన దేశాన్ని హెపటైటిస్ లేని దేశంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. అందులో భాగంగా శిశువులకు హెపటైటిస్-బి వ్యాధి నిరోధక టీకా అందిస్తున్నామన్నారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ దానికి దూరంగా ఉండవచ్చునన్నారు. అనంతరం ఆయన విద్యార్థులు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, వార్డెన్ మునస్వామి నాయక్, ఏఎన్‌ఎం భార్గవి, సీహెచ్‌వో చంద్రకళ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరుగుతున్న టమోటా ధరలు

● 22 కేజీల బాక్సు రూ.800 ● బయటి రాష్ట్రాల్లో డిమాండ్



ములకలచెరువు, జూలై 24: బయటి రాష్ట్రాల్లో డిమాండ్ ఉన్న కారణంగా టమోటా ధరలు పెరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం తగ్గిన టమోటా ధరలు ప్రస్తుతం పెరుగుతున్నాయి. ములకలచెరువు మార్కెట్ నుంచి టమోటాలు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, ఢిల్లీ, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఎగుమతి అవుతున్న రాష్ట్రాల్లో టమోటాల దిగుబడి తగ్గిపోవడంతో ఇక్కడి టమోటాలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో ధరలు పుంజుకుంటున్నాయి. స్థానిక మార్కెట్‌లో ఆదివారం టమోటా ధరలు నాణ్యతను బట్టి 22 కేజీల బాక్సు రూ.500 నుంచి రూ.800 వరకు పలికింది. నిన్నటి వరకు బాక్సు ధర రూ.400 నుంచి రూ.650 వరకు పలికాయి. ఆదివారం ధరలు పెరిగాయి. టమోటా ధరలు నిలకడగా ఉండే అవకాశం ఉందని వ్యాపారస్థులు తెలిపారు. కాగా టమోటాలు మార్కెట్‌కు పోటెత్తుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా టమోటాలు అమ్మకానికి వస్తుండడంతో మార్కెట్ కిక్కిరిసిపోతోంది.

మెగా క్రికెట్ విజేతగా ఆవులపల్లె టీమ్

రామసముద్రం, జూలై 28: రామసముద్రం మండలం చెంబకూరు గ్రామ పంచాయతీ కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న చెంబకూరు మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా ఆవులపల్లె టీమ్ నిలిచింది. రన్నర్‌గా నిమ్మనపల్లె వాల్మీకి బాయ్స్ నిలిచారు. మొదటి విజేతకు కప్‌ను సదుం రవీంద్రనాథ్ చేతుల మీదుగా రూ.15వేలు అందించారు. రెండవ విజేతకు కప్‌ను చెంబకూరు సీనియర్ క్రికెట్ సభ్యుడు అశోక్‌స్వామి, ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి చేతుల మీదుగా రూ.10వేలు అందించారు. మొదటి విజేతకు సదుం రవీంద్రనాథ్, రన్నర్‌కు మదనపల్లె జనసేన సీనియర్ నాయకుడు ఆర్‌ఆర్ జ్యూవెలర్స్ అధినేత రామాంజులు అందించారు. క్రికెట్ సభ్యులకు, అభిమానులకు భోజన వసతులు టీడీపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు అందించారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ నిర్వాహకులు జనసేన జిల్లా జాయింట్ సెక్రటరీ సనావుల్లా, మండల మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు విశ్వ నాథ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మా ఇంట్లో ఏమీ దొరకలేదు : మాజీ ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, జూలై 28: మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో గత వారం జరిగిన ఫైళ్ల దహనం ఘటనకు సంబంధించి మా ఇంట్లో ఏ ఆధారాలు దొరకలేదని మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి 8.15 గంటల వరకు పోలీసులు మాజీ ఎమ్మెల్యే ఇంట్లో సోదాలు నిర్వహించారు. సోదాల అనంతరం వీఆర్‌వోలు, పోలీసులు వెనుతిరిగారు. ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ శనివారం రాత్రి టూటౌన్ సీఐ తనకు ఫోన్ చేసి ఇంట్లో సోదాలు చేయాలని, విచారణకు సహకరించాలని కోరారన్నారు. తన పాలనలో 22-ఏకు సంబంధించి ఫైళ్లు కదిలాయని, తన ఆస్తులు కూడా ఉన్నాయని ఆరోపణలు వచ్చాయని పోలీసులు చెప్పారన్నారు. తాను అప్పుడు బెంగళూరులో ఉండటంతో ఆదివారం మధ్యాహ్నం వచ్చానన్నారు. పోలీసుల సమక్షంలో తన ఇంటి తాళాలు తీశానని పోలీసులు తన ఇంట్లోని బీరువాలు, అల్మారాలు, మంచాలు, సోఫాల కింద కూడా తనిఖీ చేశారన్నారు.